

జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి


నెల్లూరు (విద్య) : జాతీయ ఉపాధ్యాయ అవార్డుల కోసం అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జిల్లా, రాష్ట్రస్థాయి అవార్డులు తీసుకున్న ఉపాధ్యాయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు నేషనల్‌అవార్డ్స్ టూ టీచర్స్ డాట్ ఎడ్యుకేషన్ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించి అందులోని సూచనలు పాటించాలని సూచించారు. ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు వివరాలన్నీ నమోదు చేయాలని తెలిపారు.



దేశంలో మనం ఏ ప్రాంతానికి వెళ్లినా.. ప్రార్థనా మందిరాలకు వెళ్లినా.. మన ప్రాంతం పేరు, మతం పేరు చెప్పుకుంటాం. కానీ, సింహపురి గడ్డపై ఉన్న బారాషహీద్ దర్గాలో మాత్రం ఎవరూ ఎవరినీ మీ మతమేంటి, కులం ఏమిటని అడగరు. అందరిదీ ఒకే మతం.. అదే వరాల మతం.

అవును...

మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం నెలలో నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు బారాషహీద్ దర్గా ముస్తాబయ్యింది. బుధవారం నుంచి ఐదు రోజులపాటు జరిగే ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తజనం తరలిరానుంది. కోర్కెలు తీరి కొందరు.. కొత్త కోర్కెల కోసం మరికొందరు.. తొలిసారిగా వచ్చేవారు ఇలా ఎంతో మంది దర్గాకు చేరుకుని వరాల రొట్టెను అందుకుంటారు. ఏడాదికేడాది భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రపండుగగా గుర్తించింది. అంతటి విశిష్టత గల పండుగకు ఘన చరిత్రే ఉంది.







● ఐదు రోజుల పండుగ ఇలా..

రొట్టెలపండుగను ఐదు రోజులపాటు నిర్వహిస్తారు. బుధవారం ప్రారంభమయ్యే పండుగలో తొలిరోజున సందన్‌మాలీ, 18న అర్ధరాత్రి గంధ మహోత్సవం, 19న రొట్టెలపండుగ, 20 తహలీల్ ఫాతీహా, 21న ముగింపు ఉత్సవాలు ఉంటాయి. అయితే, పేరుకు ఐదు రోజుల పండుగే అయినా మొహర్రం నెల మొత్తం హిందూ ముస్లింలు దర్గాకు వస్తుంటారు. తొలుత స్వర్ణాల చెరువులో స్నానమాచరించి, రొట్టెలు మార్చుకుంటారు. ఆ తర్వాత బారాషహీద్‌లను దర్శనం చేసుకుంటారు.

● ఎన్నో రకాల రొట్టెలు

ఎంతో పవిత్రంగా భావించే రొట్టెల్లో సంవత్సరాలు గడిచే కొద్దీ రకరకాల రొట్టెలు పుట్టుకొచ్చాయి. ఆరోగ్యం, విద్యా, ఉద్యోగం, వివాహం, వ్యాపారం, సంతానం, భాగ్యం, ఇల్లు ఇలా ఎన్నో రకాల రొట్టెలు భక్తులకు అందుబాటులో ఉంటున్నాయి. ఈ రొట్టెల ప్రసాదం ద్వారా కోర్కె తీరిన భక్తులు మరుసటి ఏడాది విధిగా ఈ పండుగకు వచ్చి వారి చేతుల మీదుగా మరొకరికి రొట్టెను పంచడం, కోర్కెల సాధన కోసం ఆ రొట్టెను మహాప్రసాదంగా స్వీకరించడం ఈ పండుగ విశేషం.

కోరికల పండుగకు రారండహో!

మతసామరస్యానికి ప్రతీకగా రొట్టెల పండుగ ● ఆర్కాడు నవాబు హయాంలో ప్రారంభం ● ఏటా పెరుగుతున్న భక్తజనం ● ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

సుమారు 400 ఏళ్ల క్రితం సమాజ శ్రేయస్సు కోసం సౌది, మక్కా షరీఫ్ నుంచి 300 మంది మత ప్రచారకులు (తుర్‌ఖిస్తాన్లు) భారత్‌కు వచ్చారు. ఆ సమయంలో కర్నాటకలో హైదర్ అలీ పాలన, నెల్లూరులో నవాబు పాలన ఉండేది. ఇస్లాం మత ప్రచారం కోసం తుర్‌ఖిస్తాన్లు జిల్లాలో పర్యటిస్తూ కొడవలూరు మండలం గండవరం చేరుకున్నారు. అప్పుడే బ్రిటీష్ సైనికులకు తుర్‌ఖిస్తాన్లకు జరిగిన యుద్ధంలో 12 మంది తుర్‌ఖిస్తాన్లు ప్రాణత్యాగం చేశారు. అలా ప్రాణత్యాగం చేసిన 12 మంది తలలు గండవరం వద్ద పడిపోగా మొండేలతో గుర్రాలు నెల్లూరుకి చేరాయి. ఇలా చేరిన ఈ మొండేలను స్థానికులు స్వర్ణాల చెరువు వద్ద సమాధి చేశారు.

● ఆర్కాడు నవాబు కాలం నుంచి..

1757లో ఆర్కాడు నవాబు ఈ పండుగను ప్రారంభించారు. చెరువులో రజక దంపతులు దుస్తులు ఉతికిన తర్వాత ఓ చెట్టు కింద సేద తీరుతారు. ఆ సమయంలో రజకుడి భార్యకు ఓ దైవదూత కలలోకి వచ్చి.. బారాషహీద్‌ల సమాధుల వద్ద ఉన్న మట్టిని లేపనం చేసుకుంటే అనారోగ్యం నుంచి కోలుకుంటారని చెబుతారు. వెంటనే మేల్కొన్న ఆ మహిళ తన కల గురించి భర్తకు చెబుతుంది. అక్కడే ఉన్న రాజభటులకు జరిగిన విషమం చెబుతారు. అనారోగ్యంతో బాధపడుతున్న నవాబు కుమార్తె బాగు కోసం ఆయన చేయని ప్రయత్నం లేదు. ఈ తరుణంలోనే భటులతో వెళ్లిన రజకుల దంపతుల మాటలను నవాబు విశ్వసిస్తారు. అలాగే చేశారు. అంతే.. ఒక రోజు గడవకముందే కుమార్తె ఆరోగ్యం బాగుపడటం చూసి నవాబు ఆశ్చర్యపోతారు. దీనికి కృతజ్ఞతగా బారాషహీద్ సమాధుల వద్దకు చేరుకుని పూజలు చేస్తారు. సమాధుల మట్టితో లేపనం చేసుకోవడం వల్లే నవాబు కుమార్తె ఆరోగ్యం బాగుపడిందని ప్రజలకూ తెలియడంతో అందరూ దర్గాలో పూజలు చేయడం ఆరంభించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మొహర్రం నెలలో బారాషాహీదులకు పూజలు చేయడం ప్రారంభించారు.

● హిందువులు పెట్టిన పేరే..

దర్గాలో పూజలు చేసేందుకు సుదూరు ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ వెంట తెచ్చుకున్న రొట్టెలను తిని, మిగిలిన రొట్టెను అక్కడే ఉన్నవారికి పంచేవారు. అలా స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలు తినడం.. పక్కవారికి ఇవ్వడం ద్వారా రొట్టెల పండుగగా జరుగుతోంది. నవాబు పాలనలో ఆయన ప్రతినిధిగా ఖాజీ ఆధ్వర్యంలో పండుగ జరిగేది. అయితే, ముస్లింలు ఈ పండుగను 'మొహర్రం జియారత్' అని పిలుచుకునేవారు. చెరువు వద్ద రొట్టెలు మార్చుకోవడం ద్వారా రొట్టెలపండుగగా పిలుస్తున్నారు. ఇది హిందువులే నామకరణం చేయడం గర్వంగా ఉందని దర్గా సంరక్షకులు చెబుతున్నారు. అలా మొదలైన రొట్టెల పండుగ జిల్లా సరిహద్దులు దాటి విదేశాలకూ పాకింది. ప్రస్తుతం లక్షల మంది భక్తులు ఈ పండుగలో పాల్గొంటున్నారు. అందుకే 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి వేడుకలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువు తీరిన తరువాత తొలిసారిగా దర్గా వద్ద రొట్టెల పండుగ జరుగుతుండటంతో ప్రజాప్రతినిధులు కూడా అట్టహాసంగా నిర్వహించాలని సిద్ధమయ్యారు. దర్గా వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్నా పండుగ నిర్వహణ మాత్రం నగర పాలక సంస్థ పర్యవేక్షిస్తుంది. ఈ ఏడాది పారిశుధ్యం, మంచినీరు, ప్రైవేట్ కూలీలు, చెత్తతర లింపునకు ప్రైవేట్ వాహనాలు, భోజనాలు తదితర అంశాలతో కూడిన 41 పనులకుగాను కార్పొరేషన్ రూ.4 కోట్ల వరకు నిధులు కేటాయించింది.

● తరలిరానున్న భక్తజనం

రొట్టెల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రభుత్వ ప్రతినిధిగా కలెక్టర్ ఓ ఆనంద్ పర్యవేక్షణలో 25 శాఖల అధికారులు పండుగ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు పది లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా. ఆ మేరకు జిల్లా యంత్రాంగం భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, భద్రాతా చర్యలు, పార్కింగ్ ప్రదేశాలు, వైద్య శిబిరాలు సిద్ధం చేసింది. భద్రత పరిరక్షణ కోసం వేలాది మంది పోలీసులతోపాటు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు.

● అతిథులుగా భావిస్తూ...

రొట్టెల పండుగకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను నెల్లూరు నగరవాసులు అతిథులుగా భావించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, యువకులు తరలివచ్చి అన్నదానం, మజ్జిగ, చలివేంద్రం, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. భక్తులకు వీలుగా బస్టాండు, రైల్వేస్టేషన్ నుంచి ఉచిత వాహనాలనూ సమకూరుస్తారు.

- నెల్లూరు (సాంస్కృతికం)





స్వర్ణాల చెరువు ఘాట్‌లో భక్తజనం

2వేల మందితో బందోబస్తు



నెల్లూరు (క్రైం) : రొట్టెల పండుగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ జీ కృష్ణకాంత్ 2వేల మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాతోపాటు ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన సిబ్బందికి పోలీసు కవాతు మైదానంలో ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. ముగ్గురు అదనపు ఎస్పీలు, పది మంది డీఎస్పీలు, 48 మంది సీఐలు, 127 మంది ఎస్‌ఐ లు, 278 మంది ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 832 మంది కానిస్టేబుళ్లు, 96 మంది ఉమెన్ కానిస్టేబుళ్లు, 282 మంది హోంగార్డులు, 49 మంది మహిళా హోంగార్డులతోపాటు ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బందిని బందోబస్తుకు కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండుగలో ప్రధాన భూమిక అయిన గంధ మహోత్సవం రోజు మరింత పటిష్టంగా విధులు నిర్వహించాలని సూచించారు. దర్గా పరిసర ప్రాంతాల్లో డ్రోన్, 52 సీసీ కెమెరాల నిఘా నీడలో 24 గంటలపాటు కంట్రోల్ రూమ్ పర్య వేక్షణ ఉంటుందన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. అందరూ సమయ పాలన పాటిస్తూ ఐడీ కార్డు, విజిల్, రెయిన్ కోట్, డ్యూటీ పాస్ పోర్ట్‌లతో విధులకు హాజరు కావాలని సూచించారు. ఎవరైనా విధుల్లో అలసత్వం ప్రదర్శించినా, విధులకు గైర్హాజరైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

5,088 మంది పారిశుధ్య కార్మికులు

నెల్లూరు (సిటీ) : బారాషహీద్ దర్గాలో 5,088 మంది కార్మికులతో పారిశుధ్య నిర్వహణ చేపట్టినట్లు ఎంహెచ్‌వో వెంకటరమణయ్య తెలిపారు. ఈ మేరకు క్లస్టర్ల వారీగా కార్మికులకు విధులు కేటాయించినట్లు తెలిపారు. నలుగురు సూపర్‌వైజర్లు, 30 మంది ఇన్‌స్పెక్టర్లు, 66 కార్యదర్శులను నియమించామన్నారు. కాగ వాహన పార్కింగ్ ప్రాంతాలలో మొబైల్ టాయిలెట్స్‌తోపాటు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

అగ్నిమాపక దళం సన్నద్ధం

నెల్లూరు (క్రైం) : రొట్టెల పండుగలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అగ్ని మాపక శాఖ సిద్ధంగా ఉందని డీఎఫ్‌వో శ్రీనివాసులు రెడ్డి తెలియజేశారు. డీఎఫ్‌వో పర్యవేక్షణలో ఏడీఎఫ్‌వో వేణు గోపాల్ దర్గా ప్రాంగణం వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. దుకాణాల్లో ముందస్తుగా మంటలను ఆర్పే పరికరాల ఏర్పాటుతోపాటు దుకాణదారులకు అవగాహన కల్పించారు. స్వర్ణాల చెరువు ఘాట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు పంపు సెట్లను ఏర్పాటు చేశారు. రెండు ఐఆర్‌బీ బోట్లతోపాటు పది మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. చెరువు వద్ద అగ్నిమాపక శాఖ బోట్ పోస్ట్‌ను ఏర్పాటు చేసి, 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంటారు. నాలుగు ఫైర్ ఇంజన్లు, మిస్ట్ బులెట్, పది పోర్టబుల్ పంపు సెట్లు, రెండు ఐఆర్‌బీ బోట్లు, 40 మంది ఎక్సిటింగ్విషర్స్, 15 లైఫ్ జాకెట్లు, 15 రోప్‌లు ఇలా అనేక పరికరాలను అందుబాటులో ఉంచారు. జిల్లాతోపాటు ప్రకాశం, అన్నమయ్య, బాపట్ల, గుంటూరు, తిరుపతి, వైఎస్ఆర్ కడప జిల్లాలకు చెందిన 128 మంది సిబ్బంది విధుల్లో ఉంటారు. ఈ క్రమంలో మంగళవారం దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక శాఖ బోట్ పోస్ట్ వద్ద అగ్నిమాపక శాఖ అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

ఈయన పేరు కాకుమాని మాధవరావు. గుడ్లూరు మండలం దారకానిపాడువాసి. తనకున్న భూముల్లో 8.76 ఎకరాలను 2021లో కందుకూరు యూనియన్ బ్యాంకులో తనఖాపెట్టి రూ.24 లక్షల రుణం తీసుకున్నాడు. తీసుకున్న రుణం చెల్లించి తనఖా నుంచి భూమిని విడిపించుకు నేందుకు కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా కుదరదని సబ్ రిజిస్ట్రార్ చెప్పడంతో అవాక్కయ్యాడు. తనఖాపెట్టిన 8.76 ఎకరాలలో సర్వే నెం. 223-2, 225-3సీ, 226-1బీలలో కలిపి 0.88 సెంట్లు ప్రభుత్వ భూమి గా నిషేధిత జాబితా లో ఉండటం వల్ల కుదరదని సమాధానమిచ్చారు. అయినా తాను తనఖా నుంచి విడిపిస్తున్నానని, నిజంగా ప్రభుత్వ భూమే అయినా ప్రభుత్వానికే మంచిది కదా.. పోనీ ఆ మూడు నెంబర్లు వదిలేసి మిగిలిన భూమిని విడుదల చేయండని ప్రాధేయపడినా ససేమిరా అన్నారు. తీరా చూస్తే ఆ 3 సర్వే నెంబర్లు నిషేధిత జాబితాలో పొరపాటున చేరినందున వాటిని తొలగించాలని జిల్లాస్థాయి స్క్రూటినీ కమిటీ 2023 నవంబరు 30న ఆదేశాలు జారీచేసి ఉంది. కలెక్టరు అధ్యక్షతన ఏర్పడిన స్క్రూటినీ కమిటీ సిఫారుసు చేసి ఏడు నెలలు గడిచినా అమలుకాలేదు. దీంతో అప్పు చెల్లించి కూడా తన భూమిని తనఖా నుంచి విడిపించుకోలేని దుస్థితి మాధవరావుది.



కందుకూరుకు చెందిన చేబ్రోలు శ్రీనివాసరావుకు వలేటివారిపాలెం మండలం కూనిపాలెంలో సర్వే నెం. 360-ఏ1లో 8 ఎకరాల భూమి ఉంది. ఈయన కూడా తన భూమిని ఆరేళ్ల క్రితం కందుకూరులోని ఓ జాతీయ బ్యాంకులో తనఖాపెట్టి దీర్ఘకాలిక రుణం తీసుకున్నాడు. ప్రస్తుతం రుణం పూర్తిగా చెల్లించి తన ఆస్తికి తనఖా నుంచి విడిపించుకునేందుకు బ్యాంకు అధికారులను తీసుకుని వెళ్లగా 'మీ భూమి నిషేధిత జాబితాలో ఉంది. విడిపించడం కుదరద'ని సబ్ రిజిస్ట్రార్ సెలవిచ్చారు. తీరా విచారిస్తే శ్రీనివాసరావు ఆ భూమిని బ్యాంకులో తనఖా పెట్టాక రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల ఈ భూమి 22 (1ఏ) నిషేధిత జాబితాలో పడగా గత సంవత్సరం నవంబరులో జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ పొరపాటుని సరిచేస్తూ 360-ఏ1 సర్వే నెంబరును నిషేధిత జాబితా నుంచి తొలగించమని సిఫార్సు చేసింది. అయినా ఫలితం లేదు.



కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

'చుక్క'లు చూపిస్తున్నారు!

అమలుకాని స్క్రూటినీ కమిటీ ఆదేశాలు
నేటికీ వేలాది ఎకరాలు నిషేధిత జాబితాలోనే
బ్యాంకుల తనఖాల్లోంచి విడిపించేందుకు రిజిస్ట్రేషన్ అధికారుల ససేమిరా
ఇదెక్కడి చోద్యమని తలపట్టుకుంటున్న రైతులు

కందుకూరు : ఈ సమస్య ఈ ఇద్దరు రైతులదే కాదు. కందు కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఎంతోమంది రైతులు ఇదే సమస్యతో బాధపడుతూ కాళ్లరిగేలా తిరుగుతున్న దుస్థితి. చుక్కల భూములన్నిటినీ నిషేధిత జాబితాలో పెట్టడం ఒక సమస్య అయితే, ఎలాంటి సమస్యా లేని పట్టా భూములను కూడా రెవెన్యూ అధికారులు పొరపాటున ఆ జాబితాలో చేర్చడం మరో సమస్యకు కారణమైంది. ఇక తొలివిడత రీ సర్వేకు ఎంపికైన గ్రామాల రైతులైతే రీసర్వేలో జరిగిన తప్పుల తడకల వల్ల అనేక పట్టాభూములు ప్రభుత్వ భూములుగా నమోదై ఇబ్బంది పడుతున్నారు. చుక్కల భూముల సమస్య పరిష్కారం కోసం 2023లో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టరు, ఆయా రెవెన్యూ డివిజన్లలోని సబ్ కలెక్టర్లు లేదా ఆర్డీఓలు, ఆయా మండలాల తహసీల్దార్లతో జిల్లాస్థాయి స్క్రూటినీ కమిటీ లను ఏర్పాటుచేసి నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూముల్లో ఆ జాబితా నుంచి తొలగించాల్సిన సర్వే నెంబర్లు, భూ విస్తీర్ణాలతో సహా స్పష్టంగా పేర్కొంటూ ఉత్తర్వులిచ్చారు. గుడ్లూరు మండలం దారకానిపాడుకు సంబంధించి 2023 మార్చి 31న ప్రభుత్వం జీవో నెం. 163ను జారీచేసింది. రైతులకు చెందిన చుక్కల భూములను గుర్తించి వాటిని నిషేధిత జాబితాల నుంచి తొలగిం చేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలనేది ఆ జీఓ సారాంశం. దీంతో జిల్లావ్యాప్తంగా చుక్కల భూముల సమస్యపై కసరత్తు జరగ్గా ఆయా మండలాల తహసీల్దార్లు గ్రామాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించి రైతుల స్వాధీనానుభవంలో ఉండి, పత్రాలు కలిగిఉన్న భూములను గుర్తించి నిషేధిత జాబితాల నుంచి తొలగించేందుకు అవకాశం ఉన్న భూములను సిఫార్సు చేశారు. ఇలా దారకానిపాడు గ్రామంలో 329.35 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు 7-10-2023న గుడ్లూరు తహసీల్దారు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఆ నివేదికపై మరోసారి విచారణ జరిపి 6-10-2023 న అప్పటి కందుకూరు సబ్ కలెక్టరు ఎస్ఎస్ శోభిక జిల్లా కలెక్టరుకు నివేదించారు. అనంతరం 30-11-2023 జిల్లాస్థాయి స్క్రూటినీ కమిటీ ఆ భూములన్నిటినీ నిషేధిత జాబితా నుంచి తొలగించమని ఆదేశాలు జారీచే శారు. జిల్లా వ్యాప్తంగా చూస్తే 37 మండ లాల్లోని 322 గ్రామాలలో ఉన్న వేలాది ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని సిఫార్సు చేసి ఉన్నారు. కానీ నేటికీ ఆ ఆదేశాలు అమలు కాలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనే యులును వివరణ కోరగా 'ఇలాంటి సమ స్య ఉన్న రైతులకు తాము ఎందుకు మార్ట్ గేజ్ రిలీజ్ చేయలేక పోతున్నామో లిఖిత పూర్వకంగా ఇస్తామని, దాని ఆధారంగా కలెక్టరు నుంచి క్లియరెన్స్ తెచ్చుకుంటే నిషేధిత జాబితా నుంచి తొలగించి మార్టిగేజ్ రిలీజ్ చేస్తాము.' అని అన్నారు.

యాత్రికుల కోసం ప్రత్యేక పార్కింగ్‌లు

నెల్లూరు (క్రైం) : రొట్టెల పండుగ కోసం దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. యాత్రికుల వాహనాలు నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే ఆపాలని ఆదేశించారు. రూట్‌ల వారీగా పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ మళ్లింపులు చేసినట్లు చెప్పారు.

పార్కింగ్ ప్రాంతాలు ఇవే

- గూడూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, డీ మార్ట్ వద్ద ఉన్న సైన్స్ పార్కు వద్ద పార్కింగ్ సౌకర్యం ఇచ్చారు.
- కావలి వైపు నుంచి వచ్చే వాహనాలను ఎస్‌వీజీఎస్ కళాశాల, వీఆర్సీ మైదానం, వైఎంసీఏ మైదానంలో పార్కింగ్ చేసుకోవచ్చు.
- బుచ్చిరెడ్డిపాళెం నుంచి జొన్నవాడ మీదుగావచ్చే వాహనా లను డీఎస్ఎన్ మినీ ఫంక్షన్ హాల్ వెనుక వైపు, ఇరగాలమ్మ ఆలయం ఎదురుగా ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవచ్చు.
- పొదలకూరు, పొదలకూరు నుంచి వచ్చే వాహనాలు తెలుగంగ కాలనీ వద్ద ఆలిండియా రేడియో స్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ సౌకర్యం కల్పించారు.
- బుధవారం నుంచి 21వ తేదీ వరకు నెల్లూరులోకి ఎటువంటి భారీ వాహనాలు అనుమతించరు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

రొట్టెల పండుగ కోసం వచ్చే అధికారులు, భక్తులు ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. అధికారుల వాహనాలకు షాల్వేషన్ ఆర్మీ చర్చి, జడ్పీ కార్యాలయంలో పార్కింగ్ కేటాయించారు. వీఐపీ పాస్‌లు ఉన్న వాహనాలకు పాత టీబీ హాస్పిటల్, డీకేడబ్ల్యూ కళాశాలలో పార్కింగ్ ఇచ్చారు. ఏర్పాటు చేయడం జరిగింది. ఇక వాహనాల మళ్లింపు విషయానికి వస్తే..

- బుధవారం ఉదయం 7 గంటల నుంచి నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు ప్రారంభమవుతాయి.
- గూడూరు మీదుగా వచ్చే ఆర్టీసీ బస్సులు అయ్యప్పగుడి సెంటర్, అయ్యప్పగుడి ఫ్లైవోవర్, బీవీనగర్, అన్నమయ్య సర్కిల్ మీదుగా రామలింగాపురం అండర్ బ్రిడ్జి, ఏసీ మార్కెట్ నుంచి ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి.
- పొదలకూరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, పెద్ద వాహనాలను డైకస్ రోడ్డు నుంచి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సర్కిల్ మీదుగా అయ్యప్పగుడి సెంటర్, అండర్ బ్రిడ్జి, బీవీ నగర్, రామలింగాపురం, ఏసీ మార్కెట్ నుంచి ఆర్టీసీ డిపోకు చేరుకుంటాయి. జొన్నవాడ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు పుట్టా ఎస్టేట్, బోసుబొమ్మ, గాంధీబొమ్మ, ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి.
- బట్వాడి నుంచి పోలీసు ఆఫీస్ మీదుగా వెళ్లే వాహనాలు మూలాపేట వైపు మళ్లించారు.
- కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి డీకేడబ్ల్యూ వైపు వాహనాలను అనుమతించరు.





గుంటూరు నుంచి పాదయాత్రగా..

స్వర్ణాల చెరువులో రొట్టెలు పట్టుకునేందుకు గుంటూరు జిల్లా గుజ్జనగుళ్ల గ్రామం నుంచి సాధిక్ కుటుంబం నడిచి వచ్చింది. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ చిన్న నాటి నుంచే తాను పండుగకు వస్తున్నట్లు తెలిపారు. తనకు కలలో బారాషహీద్‌లు కనిపించి పాదయాత్రగా రమ్మని పిలుపునిచ్చారని ఈ విషయం కుటుంబ సభ్యులతో చెప్పడంతో అందరం కలిసి 3రోజులుగా నడుచుకుంటూ దర్గాకు చేరుకున్నట్లు తెలిపారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

తరలివచ్చిన భక్తులు



బారాషహీద్ దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) : కోరిన కోర్కెలు తీర్చే వరాల రొట్టెల పండుగ కోసం భక్తులు తరలివస్తున్నారు. అధికారికంగా బుధవారం నుంచి పండుగ జరగనుండగా రెండు రోజుల ముందునుంచే భక్తుల రాక మొదలైంది. మంగళవారం రాత్రికి దాదాపు 50వేల మందికిపైగా భక్తులు చేరుకుని స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకున్నట్టు అంచనా. ఆ తర్వాత కసుమూరు, ఏఎస్ పేట దర్గాలకు పయనమవుతున్నారు. చెరువులో రద్దీ తగ్గించేందుకు చదువు, ఆరోగ్యం, గృహ, వ్యాపారం, ఉద్యోగం, వీసా, విదేశీయానం, సంతానం తదితర రొట్టెల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేశారు. మత్స్యశాఖ గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసింది.

● మంగళవారం ఉదయం బారాహషీద్ దర్గా ఉత్సవ కమిటీతో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమావేశమ య్యారు. ఫెస్టివల్ కమిటీ సభ్యులు సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ షేక్.ఖాదర్‌బాషా, మైనార్టీ నేతలు షేక్.షంషుద్దీన్, సయ్యద్ సమీహుస్సేనీ, సాబీర్‌ఖాన్, తదతరులు పాల్గొన్నారు. అలాగే రాత్రి బారాషహీద్ దర్గా అధికారులతో జేసీ సేతుమాధవన్ సమీక్షించారు.

కసుమూరులో భక్తుల సందడి



దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

వెంకటాచలం : ప్రసిద్ధ యాత్రా స్థలమైన కసుమూరులోని కాలేషావీర్ మస్తాన్‌వలి దర్గాకు భక్తుల తాకిడి మొదలైంది. నెల్లూరులో రొట్టెల పండుగకు వచ్చే భక్తులు కసుమూరు దర్గాను దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి భక్తులు తాకిడి ప్రారంభమైంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ మేరకు విస్తృత పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల కోసంగా అన్ని వసతి సౌకర్యాల తదితర సదుపాయాలను వక్ఫ్‌బోర్డు అధికారులు చేపడుతున్నారు.

అన్నదాతలకు తాము చేసినంత ఏ ప్రభుత్వమూ చేయలేదని ఊకదంపుడు ప్రచారాలు చేసుకున్న జగన్ సర్కారు వారికి ఉపయోగపడే పథకాలకు మాత్రం ప్రాధాన్యం ఇవ్వలేదు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసిన బీమా పథకాన్ని పక్కన పెట్టింది. దీంతో గత రబీ సీజన్‌కు సంబంధించి బీమా సొమ్ము బీమా సంస్థకు చెల్లించక పోవడంతో రైతులకు అందాల్సిన బీమా నగదు ఇంతవరకు వారి ఖాతాలో జమకాలేదు.

పంటల బీమా.. అందని ధీమా!

- మిచౌంగ్ తుఫానుతో 933.19 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి చేతులు దులుపుకున్న వైసీపీ ప్రభుత్వం
- బీమా సొమ్ము కోసం రైతుల ఎదురుచూపు

నెల్లూరు (వ్యవసాయం), జూలై 16 : ఆరుగాలం రైతులు పండించిన పంటలు అకాల వర్షాలు, కరువు పరిస్థితుల్లో దెబ్బతింటే ఇటు ప్రభుత్వ సాయంతోపాటు పంటల బీమా సొమ్ము రైతులకు అందేలా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించేవి. 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పంటలకు సంబంధించి సీజన్ వారీగా కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 80 శాతం సొమ్ము గుర్తింపు పొందిన ఇన్సూరెన్సు సంస్థలకు చెల్లించేవి. మిగిలిన 20శాతం రైతు వాటాగా మీసేవా కేంద్రాల్లో రైతులు చెల్లించుకోవడం వల్ల పంటలకు బీమా సౌకర్యం ఉండేది. పంట రుణాలు తీసుకున్న రైతుల నుంచి బ్యాంకులు నేరుగా బీమా నగదు మినహా ఇంచుకుని మిగతా నగదు రైతుకు చెల్లించేవారు. దీంతో బీమా సొమ్ము సమయానికి ఆయా సంస్థలకు చేరేవి. అకాల వర్షాలు, తుపాన్లు, వరదలు వచ్చినప్పుడు ఆయా పరిస్థితులను బట్టి ప్రభుత్వాలు అందించే నష్టపరిహారంతోపాటుగా బీమా నగదు రైతుకు అందేది. దీంతో రైతుకు నష్టం నుంచి కొంతమేర ఉపశమనం లభించేది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్నీ మారిపోయాయి. తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటూ పంటల బీమాకు సంబంధించి రైతు వాటా కూడా తామే చెల్లిస్తామని ప్రకటించింది. అయితే గత 2022-23 రబీ సీజనుకు సంబంధించి జిల్లాలో బీమా కింద ఆయా సంస్థలకు చెల్లించాల్సిన నగదు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదు. ఖరీఫ్ సీజనులో సైతం రైతు వాటా బీమా నగదు చెల్లింపుల్లో జాప్యం చోటుచేసుకుంది. కొంత ఆలస్యంగా నగదు చెల్లించడంతో అప్పటి పరిహారం రైతుకు ఆలస్యంగా నైనా అందిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

● 933.19 హెక్టార్లలో పంట నష్టం

2022-23 రబీ సీజన్‌లో దాదాపు పంటలు చేతి కందే సమయంలో మిచౌంగ్ తుఫాను జిల్లాను అతలాకుతలం చేసింది. దాదాపు 933.19 హెక్టార్లలో వరితోపాటు వివిధ పంటలు దెబ్బతిన్నాయి. రూ.2,32,54,306 మేర పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించి నివేదికలు ప్రభుత్వానికి అందించారు. 3,822 మంది రైతులు నష్టపోయినట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. అయితే కేవలం ఇన్‌పుట్ సబ్సిడీ అందించి చేతులు దులుపుకున్న ప్రభుత్వం ఇప్పటి వరకు పంటల బీమా సొమ్ము మాత్రం జమ కాలేదు. ఏ సీజనుకు ఆ సీజనులోనే పంట నష్ట పరిహారం అంది స్తున్నామని గొప్పలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం రబీ సీజన్‌లో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు బీమా సొమ్ము చెల్లింపులు చేయలేదు. దీనికి కారణం బీమా సంస్థలకు సొమ్ములు చెల్లించక పోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. రైతులు సైతం వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బీమా సొమ్ములు ఇప్పటికీ అందకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో గతంలోలా పంటల వారీగా బీమా చెల్లింపులు జరిగే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.



నీటిలో వాలిపోయిన వరిపైరు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నక్కా జయపాల్ (ఫైల్)

అల్లూరు, జూలై 16 : మండలంలోని నార్తుమోపూరు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు, నార్తుమోపూరుకు చెందిన నక్కా జయపాల్ (17) అల్లూరు నుంచి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తన ద్విచక్రవాహనంపై వేగంగా వస్తున్నాడు. హఠాత్తుగా గేదె అడ్డురావడంతో బలంగా ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన జయపాల్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడు మృతి సమాచారం తెలుసుకున్న తల్లి నక్కా హైమావతి రోదన స్థానికులను కలచివేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ..

నెల్లూరు(క్రైం), జూలై 16: నగరంలోని పెన్నా బ్రిడ్జి రైల్వే వంతెన వద్ద మంగళవారం గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు పసుపు రంగు ఆఫ్ హాండ్స్ షర్ట్, గ్రీన్ కలర్ లోయర్ ధరించి ఉన్నాడు. ఈ సందర్భంగా రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య మాట్లాడుతూ మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



గుర్తుతెలియని మృతదేహం

విషగుళికలు తిని వివాహిత ..

అనంతసాగరం, జూలై 16: స్థానిక గిరిజన కాలనీకి చెందిన ఈగ శేషమ్మ(26) విష గుళికలు తిని మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు, భర్తకు చిన్నపాటి గొడవ కావడంతో సోమవారం రాత్రి శేషమ్మ ఇంట్లో ఉన్న విషగుళికలు తిని అపస్మారకస్థితికి చేరుకొంది. కుటుంబసభ్యులు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరు తరలించాలని వైద్యులు సూచించడంతో అక్కడ చికిత్స పొందుతూ మృత్యువాత పడింది. మృతురాలికి ముగ్గురు పిల్లలు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	128
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	258
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7017
వెండి కిలో ధర	రూ. 94,900
వెండి ఒక గ్రాము	రూ. 96.90

ఆవు దాడిలో పలువురికి గాయాలు

ఉదయగిరి రూరల్, జూలై 16: పట్టణంలోని యాదవపాళెం, బాలాజీనగర్, బస్టాండ్ ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో గోవు దాడి చేసి పలువురు గాయపరిచింది. గోవుకు కుక్క కరవడంతో దానికి పిచ్చెక్కింది. దీంతో వీధుల్లో సంచరించే మహిళలు, వృద్ధులపై విక్షణారహితంగా దాడి చేసింది. గోవు కోసం పలువురు గాలింపులు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. అలాగే పట్టణంలోని పంచాయతీ బస్టాండ్, పోలీస్‌స్టేషన్, మార్కెట్, ఎంపీడీవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో రాత్రిపగలు అనే తేడా లేకుండా రోడ్లపై గోవులు సంచరిస్తుండడంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గోవుల కుమ్ములాటలో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు సైతం గాయాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి గోవులు రహదారులపై సంచరించకుండా సంరక్షకులు వాటిని ఇళ్లకు తీసుకెళ్లలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గురుకులం విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలి

- చిన్నారులను పరామర్శించిన జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



చిన్నారుల పరిస్థితిని తెలుసుకుంటున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు (వైద్యం), జూలై 16 : నాయుడుపేట గురుకులంలో డయేరియాకు గురై చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ వైద్యులకు సూచించారు. నెల్లూరు నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను మంగళవారం ఆమె పరామర్శించారు. వారి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో 14 మంది విద్యార్థులు డయేరియాతో చికిత్స పొందుతున్నారన్నారు. ఆహారం కలుషితమైన కారణంగా ఈ పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చిన్నారులు కోలుకుంటున్నారని, ధైర్యంగా ఉండాలని తల్లిదండ్రులు చెప్పారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో చోరీ యత్నం



దుండగులు తొలగించిన ఇనుప లాకర్ గొళ్లెం



ధ్వంసం చేసిన తలుపు తాళం

మనుబోలు, జూలై 16: స్థానిక కోదండరామ పురం తపాలా కార్యాలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నం చేశారు. తపాలాకార్యాలయం ఇనుపగేట్లు, ప్రధాన ద్వారం తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి డబ్బులు దాచి ఉంచే ఇనుపలాకర్లను తీసేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. లాకర్ తీసి గడియను తొలగించారు. మంగళవారం ఉదయం విధులకు వచ్చిన ఎస్పీఎం రమణయ్య తపాలా కార్యాలయ తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అజయ్‌కుమార్ తపాలా కార్యాలయం చేరుకుని పరిశీలించారు. చోరుల వేలిముద్రలు సేకరించేందుకు క్లూస్‌టీమ్‌ను పిలిపించారు. తపాలా ఉన్నతాధికారులు వచ్చి మరో తాళం ద్వారా లాకర్లను తెరిచారు. నగదు భద్రంగానే ఉండడంతో తపాలా సిబ్బంది, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉలవపాళ్ల వద్ద గుర్తు తెలియని మృతదేహం

చిట్రగుంట,(దగదర్తి) జూలై 16: దగదర్తి మండలం ఉలవపాళ్ల జాతీయ రహదారికి తూర్పున జామాయిల్ తోట, మూర్తిరాజుపాలెం సంఘం సమీపంలో కరతుమ్మ చెట్టుకు వేలాడుతున్న వ్యక్తి (40) మృతదేహం మంగళవారం కలకలం రేపింది. మృతదేహం పరిస్థితిని బట్టి నాలుగు రోజుల క్రితం ఉరివేసుకుని ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో జనసంచారం ఎక్కువగా లేకపోవడంతో ఎవరూ ఈ మృతదేహాన్ని గుర్తించలేదని వారు అంటున్నారు. మృతదేహం బాగా చెడిపోయి పురుగులు పట్టి దుర్గంధ వెదజల్లుతున్నది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

21న జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), జూలై 16: జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా సీనియర్స్ స్త్రీ, పురుషుల క్రీడా జట్ల ఎంపికకు పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కోటారెడ్డి, సీహెచ్.కామేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు చిత్తూరు జిల్లా పుత్తూరులో ఆగస్టు 10 నుంచి 12వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు సంబంధిత తేదీలలో నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 9703654315, 8074299640లను సంప్రదించాలని తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 16: మండలంలోని పెనుబల్లిలో ఆకుల గంగాధర్‌రెడ్డి అనే రైతు మనస్తాపానికి గురై మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పొలంలో మోటారు వేసి వస్తానని షెడ్డు తాళం తీసుకుని వెళ్లిన ఆయన చీకటిపడినా ఇంటికి రాలేదు. దీంతో ఆయన చిన్న కొడుకు పొలానికి వెళ్లి చూసేసరికి షెడ్డులో పడుకుని ఉన్నాడు. లేపినా ఎంతకీ లేవకపోవడంతో పెద్దకొడుకు పురంధర్‌కు ఫోన్ చేసి పురుగుమందు తాగినట్లు చెప్పాడు. దీంతో పురంధర్‌తోపాటు పలువురు గ్రామస్థులు పొలానికి చేరుకుని గంగాధర్‌ను చికిత్స కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



సోమశిల జలాశయంలో 9.860 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూలై 16: సోమశిల జలాశయంలో మంగళవారానికి 9.860 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువప్రాంతాల నుంచి 55క్యూసెక్కులు వస్తుండగా దిగువ డెల్టాకు 200క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రాపూరు సీఐ బదిలీ

నెల్లూరు(క్రైం), జూలై 16 : రాపూరు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఎం సుబ్రహ్మణ్యంను పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ సీఐగా బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఎవ్వరిని నియమించలేదు.

హేచరీలలో నాణ్యమైన పిల్లలను ఉత్పత్తి చేయాలి : మత్స్యశాఖ జేడీ

విడవలూరు, జూలై 16 : తీర ప్రాంతంలో ఉన్న హేచరీలలో నాణ్యమైన రొయ్య పిల్లలను ఉత్పత్తి చేయా లని మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు కోరారు. మండలంలోని మున్నంగి హేచరీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రొయ్యపిల్లల ఉత్పత్తితో హేచరీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని, అందువల్ల నాసిరకమైన పిల్లలను వేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. హేచరీల నిర్వాహకుల తీరు మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామ న్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీఈ ఆర్.బాబు, సీఏఏ కమిటీ సభ్యులు దివాకర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండి, ఆటో ఢీ : 12 మందికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 16: ఏఎస్‌పేట నుంచి మంగళవారం 12 మందితో వస్తున్న ఆటో బుచ్చి టోల్‌గేట్ సమీపంలో ఎడ్లబండిని ఢీకొంది. ఈ ప్రమాదం లో ఆటోలోని 12మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే బాధితులను బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసేవలందించారు. తీవ్రంగా గాయపడినవారిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరు పెద్దాసుపత్రికి తరలించారు. బాధితులంతా తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాకు చెందినవారు. వారు రొట్టెల పండుగకు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మెట్టలో మట్టి మాఫియా..

- అక్రమంగా తరలింపు

ఉదయగిరి రూరల్, జూలై 16: ఉదయగిరి ప్రాంతంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. మంగళవారం స్థానిక పెద్ద చెరువు నుంచి కొంతమంది ఇటుకబట్టీ నిర్వాహకులు ఎక్స్‌కవేటర్ సహాయంతో పది ట్రాక్టర్లతో ఎలాంటి అనుమతుల్లేకుండా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. సెలవుదినాలు, అధికారులు రాని సమయాన్ని అదునుగా చూసుకొని జోరుగా మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉదయగిరి పెద్ద, చిన్న చెరువుల్లో ఇష్టానుసారంగా మట్టి తరలిస్తుండటంతో పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ప్రభుత్వం ఓ వైపు హెచ్చరికలు చేస్తున్నా మట్టి మాఫియా వారి హెచ్చరికలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇందులో అధికార పార్టీ నాయకుల హస్తం ఉండటంతో ఇటుకబట్టీల నిర్వాహకులు తమకేమీ కాదనే ధీమాతో ఉన్నారు. ఇంతజరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లుగా ఉండటంతో అనుమానాలకు తావిస్తోంది.



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న మట్టి

వాహనాలను సీజ్ చేస్తాం: చంద్రమౌళి, జలవనరుల శాఖ, డీఈ

అనుమతుల్లేకుండా చెరువుల్లో మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. ఇప్పటికే వాహనదారులను పలుమార్లు హెచ్చరించాం. వారిలో మార్పు రావడం లేదు. త్వరలో వాహనదారులతో సమావేశం ఏర్పాటు చేసి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

రేషన్ గోదాము తనిఖీ

సంగం, జూలై 16: జండాదిబ్బలోని రేషన్ గోడౌన్‌ను మంగళవారం తహసీల్దారు రమాదేవి తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రేషన్ దుకాణాలకు సరుకులను సకాలంలో తరలించాలన్నారు. తూకాల్లో ఎలాంటి తేడాలు లేకుండా చూడాలన్నారు. ఆమె వెంట రాజనారాయణ, వీఆర్వో ఉన్నారు.

అనంతసాగరం చెరువు పరిశీలన

అనంతసాగరం, జూలై 16: అనంతసాగరం చెరువు ఒకటి, రెండు నెంబర్ తూములను మంగళవారం స్థానిక రైతులతో కలిసి ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. వీలైనంత త్వరగా తూముల మరమ్మతులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ లీలావతి, ఏఈ ఖాదర్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉదయగిరి రూరల్, జూలై 16: స్థానిక నాగులబావివీధి సెంటర్‌లో సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగ తెగి రోడ్డుపై పడింది. సమీపంలో పీర్ల చావిడి ఉండటంతో యువకులు విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి తెగిపడిన తీగను సరి చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

మినరల్ వాటర్ సరఫరా చేయాలి

ఆత్మకూరు, జూలై 16: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే నీటిశుద్ధి ప్లాంట్‌ను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులతో కలిసి పరిశీలించారు. ప్లాంట్‌ను శుద్ధిచేసి సురక్షత జలాలను సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ షేక్ ఫజులుల్లా, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు, షేక్ గౌస్‌బాష, సూరా భాస్కర్‌రెడ్డి, గందళ్ల వేణు, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, బుజ్జిరెడ్డి, చిన్నపురెడ్డి, షేక్ ఖాదర్‌బాష పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రంగా పేరు మార్పు

సీతారామపురం, జూలై 16: మండలకేంద్రంలోని బీట్-1 సచివాలయ పరిధిలోని రైతుభరోసా కేంద్రాన్ని అధికారులు మంగళవారం రైతుసేవా కేంద్రంగా పేరు మార్చి బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో పీ.చెన్నారెడ్డి మాట్లాడుతూ అన్ని ఆర్‌బీకేలను రైతుసేవా కేంద్రాలుగా మారుస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ఉదయగిరి, జూలై 16: స్థానిక గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకల్పన మంగళవారం కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఆరోగ్యసహాయకులు, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2వరకు సర్వే నిర్వహించి వివరాలు అందించాలన్నారు.

గండిపాళెం పీహెచ్‌సీలో కాన్పు

ఉదయగిరి రూరల్, జూలై 16: గండిపాళెం పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కొన్నేళ్లుగా పీహెచ్‌సీలో కాన్పులు జరిగిన దాఖలాల్లేవు. ఆస్పత్రి వైద్యులుగా బాధ్యతలు చేపట్టిన శివకల్పన, వినీలు వైద్య సిబ్బందికి సూచనలిస్తూ 24 గంటలు స్టాఫ్ నర్స్ సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు. ఇటీవల వైద్యశాలలో మూడు కాన్పులు జరగ్గా మంగళవారం వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లి గ్రామానికి చెందిన కల్యాణి పురిటినొప్పులతో వైద్యశాలకు రావడంతో స్టాఫ్ నర్సులు ఆమెకు సాధారణ కాన్పు చేశారు. వైద్యశాలలో అన్ని సదుపాయాలు ఉండడంతో కాన్పులు చేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో మధులత

ఏఎస్ పేట, జూలై 16: నెల్లూరులోని బరాషాహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగ సందర్భంగా ఏఎస్ పేట దర్గాకు విచ్చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకార్యలు కల్పించాలని ఆత్మకూరు ఆర్డీవో మధులత తెలిపారు. మంగళవారం ఆమె పేట దర్గా పరిసర ప్రాంతాలు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. భక్తుల సౌకార్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దారు రవికుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి, దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ పాల్గొన్నారు.

అన్నిఏర్పాట్లు పూర్తి: రొట్టేల పండుగ సందర్భగా ఏఎస్ పేట దర్గాకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ తెలిపారు. ఆర్డీవో మధులత ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సంగం: స్థానిక బ్యారేజి వద్దకు స్నానానికి వచ్చే యాత్రికులకు కోసం ముందస్తు రక్షణ ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దారు రమాదేవి, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. బ్యారేజి వద్ద సిబ్బందితో ఆనకట్ట పరిసర ప్రాంతాలు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటును పరిశీలించారు. రొట్టెల పండుగ జరిగే ఐదురోజులు కాపలా ఉండేట్లు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ బీవీ కృష్ణ ఉన్నారు.

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ఎంజీబీఎస్, జేబీఎస్, బీహెచ్‌ఈఎల్ వెళ్లేందుకు నూతన బస్సు సర్వీసులు బుధవారం నుంచి ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిరోజు రాత్రి 8.30గంటలకు ఉదయగిరి నుంచి బస్సులు బయలు దేరుతాయని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధినేతల చిత్రపటాల బహూకరణ



ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలను అందజేస్తున్న నాయకులు

సీతారామపురం, జూలై 16: టీడీపీ మండల సీనియర్ నాయకుడు ముత్తంశెట్టి చెన్నకేశవులు, తెలుగు యువత నాయకులు ఎడమ ప్రవీణ్ కుమార్ మంగళవారం బాలాయపల్లి సచివాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, కనకద్రి, బ్రహ్మయ్య, సాల్మన్‌రాజు, తిరుపతయ్య, సిబ్బంది మాల్యాద్రి, బాలయ్య, ప్రతాప్, సావిత్రి పాల్గొన్నారు.

కౌలు రైతులకు హక్కు పత్రాల పంపిణీ

సీతారామపురం, జూలై 16: అయ్యవారిపల్లి రైతుసేవా కేంద్రంలో మంగళవారం కౌలు రైతులకు పంటసాగు హక్కుపత్రాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజనుకు మండలానికి 367కార్డులు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు 67కార్డులు మంజూరు చేశామన్నారు. గ్రామసభలతో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. కౌలుదారునికి భూమిపై ఎలాంటి హక్కు ఉండదని, వారు కార్డులు పొందుటకు మాత్రమే అర్హులన్నారు. కార్యక్రమంలో వీఆర్వో మురళి, ఎఈవో నారాయణ, వీఏఏ నరేంద్ర పాల్గొన్నారు.

పరిశుభ్రతకే మొదటి ప్రాధాన్యం



కుళాయిల వద్ద బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్న కార్మికులు

సీతారామపురం, జూలై 16: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు ఈవోపీఆర్డీ భార్గవి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మంగళవారం సీతారామపురం పంచాయతీలోని బెస్తకాలనీ, కురవ వీధుల్లోని కొళాయిల వద్ద, మురు గు కాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. అనంతరం డయేరియా నివారణ చర్యల్లో భా గంగా నీటి నమూనాలు సేకరించి గ్రామ సచివాలయంలో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

తుమ్మలపెంట గురుకులంలో
చెట్ల కిందే భోజనాలు

- శిథిలావస్థలో డైనింగ్ హాలు
- తిప్ప పాఠశాలలో లోతైన గుంతతో తంటాలు
- పెదపవనిలో వసతి గదులు చాలక ఇక్కట్లు

కావలి రూరల్, జూలై 16: మండలంలోని తుమ్మలపెంట గురుకుల పాఠశాలలో డైనింగ్ హాలు శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థినులు చెట్ల కిందే భోజనాలు చేస్తున్న దృశ్యం మంగళవారం ఆంధ్రజ్యోతి కంటపడింది. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యార్థినుల కోసం డైనింగ్ హాల్ నిర్మించారు. నాటి డైనింగ్ హాలు భవనం పెచ్చులూడి పడుతూ ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రి లోకేష్ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రూ.60 లక్షలతో డైనింగ్ హాలు నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చారు. 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఆ పనులు నిలిపివేశారు. కొత్త ప్రభుత్వ మైనా మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేసి డైనింగ్ హాలును వాడుకలోకి తీసుకురావాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని గురుకుల పాఠశాలను ఆంధ్రజ్యోతి మంగళవారం విజిట్ చేసింది. పాఠశాల ఆవరణంలో లోతైన గుంత ఉందని, దాని వల్ల వర్షాకాలం తీవ్రఇబ్బందిగా ఉందని విద్యార్థినులు తెలిపారు. అధికారులు, దాతలు చొరవ తీసుకుని గుంత పూడ్పించాలని వారు కోరారు.

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో వసతి గదులు చాలక విద్యార్థినులు ఇక్కట్లు పడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆ పాఠశాలను ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించగా మెనూ ప్రకారం భోజనంలో క్యారెట్ కూర, తోటకూర పప్పు, బాయిల్డ్ కోడి గుడ్డు, పెరుగు వడ్డించారు. అనంతరం పలువురు విద్యార్థినులను ప్రశ్నించగా బాగుందని చెప్పారు. ఈ విద్యాలయంలో ఆవరణలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన వసతిగృహం శిథిలావస్థకు చేరడంతో దాన్ని ఉపయోగించడం లేదు.దీంతో విద్యార్థినులు ఇరుకు గదులతో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గదుల వసతి కల్పించాలని వారు కోరుతున్నారు.



తుమ్మలపెంట గురుకులంలో చెట్ల కింద భోజనాలు చేస్తున్న విద్యార్థినులు



పెదపవని బాలికల గురుకుల పాఠశాలలో శిథిలమైన వసతిగృహం గదులు

కౌలురైతులంతా ధ్రువీకరణ పత్రాలు పొందాలి



కందుకూరు : కౌలురైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

కందుకూరు, జూలై 16: కౌలు రైతులంతా సాగు ధ్రువీకరణ పత్రాలు పొందటం ద్వారా ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలకు అర్హులు కావాలని మండల వ్యవసాయాధికారికి వీ రాము సూచించారు. మండలంలోని ఓగూరు రైతు సేవాకేంద్రంలో మంగళవారం కౌలుదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసే ప్రతిరైతు గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి సాగు ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కే శరత్‌కుమార్, వీఆర్‌వోఏ. శివశంకర్, పంచాయతీ కార్యదర్శి ఎం. నాగదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఎంతో ఉపయోగకరమని మండల వ్యవసాయ అధికారి టీ అబ్రహం లింకన్ చెప్పారు.మంగళవారం మండలంలోని అన్నెబోయినపల్లి, వీఆర్ కోట గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో వీఆర్‌వోలు అమానుల్లాఖాన్, ప్రసాద్, వీఏఏ షేక్ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : మండల పరిధిలోని కొమ్మి, సత్యవోలు, పార్లపల్లి గ్రామాల్లో మంగళవారం కౌలురైతు కార్డుల పంపిణీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మస్తానయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈవో ఈశ్వరాచారి, వీఏఏలు బాలక్రిష్ణ, సుమతి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

కలిగిరి : కౌలు రైతులు గుర్తింపు కార్డును కలిగిఉంటే ప్రభుత్వం ద్వారా అందే అన్నిరకాల రాయితీలను పొందవచ్చని వ్యవసాయాధికారి ఎంసురేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపాలెం, తెల్లపాడు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వీఎఆర్వోలు నరేష్, రామకృష్ణ, వీహెచ్‌ఏ రమేష్, వీఏఏ జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుపై అవగాహన

వలేటివారిపాలెం, జూలై 16: మండలంలోని పోకూరు గ్రామసచివాలయలో మంగళవారం క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపులపై వినియోగదారులకు ఏఈ తాటికొండ మధుబాబు అవగాహన కల్పించారు. వినియోగదారులు గ్రామ సచివాలయాలకు వెళ్లి సమయం వృథా చేసుకోకుండా, తమ ఫోన్‌లోనే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకొని బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కొడవలికణ వ్యాధిపై అవగాహన

వలేటివారిపాలెం, జూలై 16: మండలంలోని అత్తింటివారిపాలెంలో మంగళవారం వైద్యఆరోగ్య సిబ్బంది, ఐసీడీఎస్ కార్యకర్తలు కొడవలికణ వ్యాధిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ జన్యుపరమైన మార్పుల వల్ల వచ్చే ఈ జబ్బుకు సరైన మందులు లేవని తెలిపారు. నివారణే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, ఏఎన్‌ఎం అనీత, ఎంఎల్‌హెచ్‌పీ మధూషా తదితరులు పాల్గొన్నారు.

యువత అన్నీ రంగాల్లో రాణించాలి

బిట్రగుంట, జూలై 16: యువత అన్ని రంగాల్లో రాణించాలని జనసేన కావలి నియోజకవర్గ నేత సిద్దు అన్నారు. బోగోలు మండలం ముంగమూరు ఆదరణ కేంద్రంలో ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్‌లో రెండో స్థానం సాధించిన శ్రావణ్‌కుమార్‌ను మంగళవారం ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలొ జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలికలను చదివించడం బాధ్యత

కావలిటౌన్, జూలై 16: బాలికలను రక్షించుకోవడం, చదివించుకోవడం సామాజిక బాధ్యతని అల్లూరు ఎంపీడీవో వీ జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ సమావేశ మందిరంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఒకరోజు శిక్షణ జరిగింది. సీడీపీవో సౌజన్య పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ఏడీపీవో జే శారద, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రమ్య, డాక్టర్ మాధవి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీవో ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మన్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న గ్రామస్థులు

గుడ్లూరు, జూలై 16 : మండలంలోని రాళ్లపాడు మన్నేరు రేవు నుంచి, అక్రమంగా తరలిపోతున్న ఇసుక రవాణాను, మంగళవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. మూడు రోజుల నుంచి రాత్రి సమయంలో తరలిపోతున్న ఇసుక రవాణా విషయాన్ని గమనించిన గ్రామస్థులు, రవాణాను అడ్డుకొని, రేవులో ఎక్స్‌కవేటర్ పనులను నిలిపివేశారు.ఇసుక తరలింపు విషయమై కందుకూరు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకొని అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్టవేయాలని గ్రామస్థులు కోరారు.

కందుకూరులో పోలీసు అధికారుల బదిలీ?

కందుకూరు, జూలై 16: నియోజకవర్గంలో పోలీసు అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ప్రస్తుతం కందుకూరు, గుడ్లూరు సర్కిళ్లలో పనిచేస్తున్న అధికారుల్లో ఒక్క ఎస్‌ఐని మినహా అందరినీ బదిలీ చేయాలన్న నిర్ణయానికి అనుగుణంగా రెండుమూడురో జుల్లో బదిలీ ఉత్తర్వులు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ఇప్పటికే ఉన్నతాధికారులకు స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు వెళ్లగా త్వరలో ఆర్డర్లు ఇవ్వనున్నట్లు తెలిసింది.

నేడు జలదంకి మండల సమావేశం

జలదంకి, జూలై 16: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుదవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. ఎంపీపీ జీ వెంకటరమణయ్య అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. అన్నిశాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరు కావాలని తప్పక రావాలన్నారు.

టిడ్కో గృహ సముదాయాన్ని మహానగరంగా మార్చుతా..



టిడ్కో గృహాల పరిస్థితిని ఎమ్మెల్యే కావ్యకు వివరిస్తున్న ఈఈ ఉమాశంకర్ శాస్త్రి

కావలి, జూలై 16: టిడ్కో గృహ సముదాయాన్ని మహానగరంగా మార్చడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని మద్దూరుపాడులో నిర్మించి ఉన్న టిడ్కో గృహసముదాయాన్ని మంగళవారం ఎమ్మెల్యేతోపాటు ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీ, టిడ్కో ఈఈ ఉమాశంకర్ శాస్త్రి, తదితరులు పరిశీలించారు. గృహాల్లోకి వెళ్లి అక్కడ నివసిస్తున్న వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్లు, నీటిట్యాంకు, పార్కు, రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల సముదాయంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, పుష్కలంగా నీరు అందేలా చర్యలు చేపడతానన్నారు. నెలలోపు విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌కు ఇక్కడ బాధ్యతలు అప్పగిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయనే ఇక్కడి సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సాయిరాం, టీపీవో బాబూరావు, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మన్నవ రవిచంద్ర, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, జ్యోతి బాబూరావు, అర్షియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



ఆధార్ ఎన్‌రోల్ పత్రాన్ని లబ్ధిదారునికి అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

కందుకూరు, జూలై 16: పట్టణంలోని ఏకలవ్యనగర్‌లో విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు చేయాలంటే డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి అయినందున, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆధార్‌కేంద్రాల వద్దే పుట్టినరోజు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయించామన్నారు. ఆధార్ జారీ అయినవారికి అక్కడికక్కడే బ్యాంకర్లు జీరో అకౌంట్ ఓపెన్‌చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. సబ్ కలెక్టరు జీ విద్యాధరి, మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు.

కుష్టు వ్యాధి గుర్తింపునకు ప్రత్యేక చర్యలు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అనీల్ కుమార్

కావలి రూరల్, జూలై 16: కుష్టువ్యాధి గుర్తింపునకు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తుమ్మలపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి అనీల్ కుమార్ పేర్కొన్నారు. పీహెచ్‌సీలో కుష్టువ్యాధి గుర్తింపు, నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి 14 రోజుల పాటు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 28 టీంలతో కుష్టు వ్యాధిపై సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి ఎంవీ సుజాత, పీహెచ్‌ఎన్ శాంతకుమారి, సూపర్‌వైజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : ఈనెల 18 నుంచి ఆగస్టు 2వరకు కుష్టు వ్యాధి నిర్ధారణపై ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలకు స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో లెప్రసీ కేసులను గుర్తించుటకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జీ సునీల్‌కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

బిట్రగుంట : మొహర్రం సందర్భంగా బోగోలు పీర్లచావిడిల వద్ద మంగళవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారు జామున బోగోలు రాజావీధి పీర్ల చావిడిల వద్ద గుండం తొక్కారు.

అధినేతల చిత్రపటాల ఏర్పాటు

జలదంకి : మండలంలోని అన్నవరం సచివాలయంలో మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధినేతల చిత్రపటాలను కూటమి నాయకులు ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను వీరు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ జీ వెంకటరమణయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోర్శిపాటి మాధవరెడ్డి, పూనూరు రామక్రిష్ణారెడ్డి, ముచ్చాల మనోహర్‌రెడ్డి, నక్కా మాధవరావు, గంటా అశోక్, చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.



వైభవంగా హనుమాన్ గ్రామోత్సవం

పొదలకూరు, జూలై 16: హనుమజ్జయంతి ఏడో మంగళవారం కమ్మజన సేవా సంఘం ఆధ్వర్యంలో వీర అభయాంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అందులో భాగంగా ఉదయం హనుమంతుడికి ఆకుపూజ, అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాఅన్నదానం నిర్వహించారు. అన్నదానానికి 3వేల మంది భక్తులు హాజరయ్యారు. సాయంత్రం రంగురంగుల విద్యుత్ దీపాలంకరణల, బాణాసంచా వేడుకలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై హనుమంతుని గ్రామోత్సవం కన్నులపండుగ సాగింది. భక్తులు పాల్గొని కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతికం కార్యక్రమాలు యువతను అలరించాయి.

విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు పయనం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



ప్రత్యేక పూజలో పాల్గొన్న సోమిరెడ్డి, కొమ్మి

పొదలకూరు, జూలై 16: వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో విధ్వంసం సృష్టించారని, దాన్ని నుంచి కోలుకొని అభివృద్ధి వైపు నియోజకవర్గానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమజ్జయంతి అనంతరం ఏడో మంగళవారాన్ని పురస్కరించుకుని కమ్మజన సేవా సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడుతో కలిసి పాల్గొని స్వామికి పూజలు చేశారు. మండలంలో పేదవాళ్లకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్ మూసేశా రని, మండలాసులకే రూ.2కే మినరల్ వాటర్ అందించే మెగా వాటర్ ప్లాంట్ ఆపేశారన్నారు. అలాగే దక్షిణ కాలువ పనులు నిలిపివేశారని, కండలేరు ఎడమ గట్టు కాలువకు కరెంటు బిల్లు కట్టకుండా లిఫ్ట్ ఇరిగేషన్ ఆపేశారని ఇలా ఐదేళ్లపాలనలో విధ్వంసం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, మల్లినేని వెంకటేష్‌నాయుడు, దేవినేని శరత్, పులిపాటి వెంకటరత్నం నాయు డు, బక్కయ్యనాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, కోడూరు పెంచల బాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, రాజారెడ్డి, గంటా మల్లికార్జున్, జమీర్ పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాల ఆకస్మిక తనిఖీ

తోటపల్లిగూడూరు, జూలై 16: మండలంలోని సాంఘిక సంక్షేమ గృహాలు, కోడూరులోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలను మంగళవారం ఎంపీడీవో బాలాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లో ఆహార పరిశుభ్రత ఏర్పాట్లను పరిశీలించారు.. పిల్లల హాజరును పరిశీలించి వంటగది, హాస్టల్ పరిసరాలను తనిఖీ చేశారు. విద్యార్థుల భోజన విషయంపై ఆరా తీశారు. ఇటీవల నాయుడుపేట అంబేద్కర్ గురకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో పలువురు పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పోలయ్య



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సైదాపురం, జూలై 16: రాజమండ్రి మావో భవన్‌లో ఈ నెల 20న జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డీపీ పోలయ్య తెలిపారు. మంగళవారం స్థానిక అఖిల భారత రైతు కూలీ సంఘం కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ ప్రజా వ్యతి రేక విధానాలపై సమరశీలంగా ఉద్యమించేందుకు సిద్ధం కావాలని రైతులకు పిలుపుని చ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేష్, ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకయ్య రవి, సుధాకర్, రమణరాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

రవాణామంత్రిని కలిసిన ప్రశాంతిరెడ్డి



విడవలూరు, జూలై 16 : రాష్ట్ర క్రీడలు, రవాణా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని అమరావతిలోని సచివాలయంలో మంగళవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నియోజకవర్గ టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న క్రీడా మైదానాలను అభివృద్ధి పరచాలన్నారు. నియోజకవర్గానికి ఐదు స్టేడియాలను మంజూరు చేయాలని ఆమె కోరారు.

ప్రభుత్వ భూములు కాపాడండి

కొడవలూరు జూలై 16: మండలంలోని నార్తు రాజుపాలెంలో అన్యాక్రాంత మైన ప్రభుత్వ భూములను కాపాడాలని టీడీపీ ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ కుమార్ కోరారు.ఈ మేరకు మంగళవారం ఆయన తహసీల్దార్ శైలేంద్రకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎంతోమంది నిరుపేదలు ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.

మూడు రీచ్‌లలో ఇసుక అందుబాటులో ఉంచాం

● ఆర్డీవో మలోల

మనుబోలు, జూలై 16: జిల్లాలోని మూడు రీచ్‌లలో ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచామని నెల్లూరు ఆర్డీవో మలోల తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం మాట్లాడారు. అక్రమ లేఅవుట్లపై కమిటీల ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. చెరువులు, వాగులు, వంకలు, ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు వేసి ఉంటే, వాటిపై దాడులు చేసి తొలగించి అడ్డుకుంటామన్నారు. అనుమతి లేకుండా గ్రావెల్, మట్టి తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి, ఇన్‌చార్జి డీటీ శివప్రసాద్ పాల్గొన్నారు.

బెదిరించి సంతకాలు చేయించారు !

● ముత్తుకూరు సర్పంచి ఆరోపణ

ముత్తుకూరు, జూలై 16: వైసీపీ నాయకులు తనను బెదిరించి సంతకాలు చేయించి అక్రమాలకు పాల్పడ్డారని మేజర్ పంచాయతీ ముత్తుకూరు సర్పంచ్ బూదూరు లక్ష్మి ఆరోపించారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి సూచనల మేరకు ఉప సర్పంచ్ కాకుటూరు అనితరెడ్డి, ఆమె భర్త లక్ష్మణరెడ్డి, వైసీపీ నాయకులు ముత్యంగౌడ్, అప్పటి ఈవో చక్రం వెంకటేశ్వర్లు కలిసి ఎస్టీ కులానికి చెందిన తనపై అజమాయిషీ చలాయిస్తూ అక్రమంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. తన విధులను సక్రమంగా నిర్వహించకుండా అడ్డుకున్నారని చెప్పారు. సర్పంచ్ అనే గౌరవం లేకుండా తనను అతినీచంగా చూశారన్నారు. పనులకు సంబంధించి ఏ విషయాన్ని తనకు చెప్పకుండా ఇష్టారాజ్యంగా వారికి అవసరమైనట్లు సంతకాలు పెట్టాలని లేనిపక్షంలో తన భర్తకు కుటుంబానికి హాని చేస్తామని బెదిరించారన్నారు. ముత్తుకూరు పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగం ఇతర అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలను కోరారు. వైసీపీ నాయకులు అరాచకాలకు భయపడి ఇంతకాలం మౌనంగా ఉండాల్సి వచ్చిందన్నారు. పంచాయతీ పరిధిలో జరిగిన అరాచకాలు, అక్రమాలపై అధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, జూలై 16: కంటేపల్లి సమీపంలోని మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరులోని జ్యోతినగర్ ప్రాంతానికి చెందిన ఈశ్వరయ్య పనినిమిత్తం మోటర్‌బైక్‌పై గొలగ మూడికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా కంటేపల్లి సమీపంలోని మలుపు వద్ద ఒక్కసారిగా ట్రాక్టర్ అడ్డురావడంతో అదుపుతప్పి బైక్ పక్కనే ఉన్న గుంటలోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఈశ్వర య్యకు గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని వెంకటా చలంలోని సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 16 : కులమతాలకు అతీతంగా బుచ్చితోపాటు మండలంలోని పెనుబల్లి, కాగులపాడు గ్రామాల్లో మంగళవారం మొహర్రం వేడుకలు నిర్వహించారు. హిందువులు, ముస్లింలు కలిసిమెలిసి పీర్లపండుగను జరుపుకున్నారు. మొహర్రం సందర్భంగా బుచ్చిలోని కాశీపాళెం, ఖాజానగర్, హౌస్‌తోట ప్రాంతాలతోపాటు మండలంలోని పెనుబల్లి, కాగులపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో పీర్లను ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, మంగళవారం రాత్రి ఆయా గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు ఏర్పాటు చేసి, ఉపవాసాలతో అర్ధరాత్రి నుంచి గుండం తొక్కారు. బుధవారం మధ్యాహ్నం పీర్లు నీళ్లకు వెళ్లడంతో పీర్ల పండుగ ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

నేడు తొలి ఏకాదశి

● చాతుర్మాస దీక్షలు ప్రారంభం ● వైష్ణవ ఆలయాల్లో పూజలు



నెల్లూరు(సాంస్కృతికం), జూలై 16 : తెలుగు సంవత్సరంలో పండుగలన్నింటిని వెంట పెట్టుకొని వచ్చేది తొలి ఏకాదశి. హిందూ సంప్రదాయం ప్రకారం ఈ పండుగకు ఎంతో విశిష్టత ఉంది. ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. ఏకాదశి అంటే 11 అని అర్థం. మనకు ఉన్న 5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు వీటిని పని చేయించే అంతరేంద్రియం అయిన మనస్సుతో కలిపి పదకొండు. ఈ 11 జ్ఞానేంద్రియాలకు ఒక తాటిపై పనిచేసే సమయమే ఏకాదశి. తొలి ఏకాదశిని పురాణాల్లో శయన ఏకాదశి, ప్రథమ ఏకాదశి, హరిహసరం అంటారు. ఆషాఢంలో వచ్చే తొలి ఏకాదశి నుంచి కార్తీక మాసం శుక్లపక్ష ద్వాదశి వరకు క్షీర సముద్రంలో విష్ణుమూర్తి 4నెలలు పాటు నిద్రిస్తారు. అందువలన గురువులు, పీఠాధిపతులు ఎక్కడ ఉన్నవారు అక్కడినే చాతుర్మాస దీక్షలు ప్రారంభిస్తారు. అలాగే గోపద్మావ్రతం చేస్తారు. తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగువారు ఏకాదశి ఉపవాసాలు పాటిస్తారు. శయన విష్ణుమూర్తిని ఆరాధిస్తారు. స్వామివారికి పేలపిండిని నైవేద్యం సమర్పిస్తారు. జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు చేస్తారు. ఈనెల 21 నుంచి జైనులు చాతుర్మాస దీక్షలు ప్రారంభిస్తారు. అహింసావాదంపై ర్యాలీ చేస్తారు.

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం ఉదయం 8.30 గంటలకు 108 లీటర్ల పాలతో తిరుమంజనం, రాత్రి బంగారు గరుడసేవలో పేట ఉత్సవం జరుగుతోంది.

● మాగుంటలే అవుట్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 6.30 గంటలకు పంచకలశ స్నపన తిరుమంజనం చేస్తారు.

● మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో సాయంత్రం 6.30 గంటలకు తులసీదళ అర్చన, పుష్పార్చన, ఊంజల్ సేవలు జరుగుతాయి.

● పప్పులవీధి ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి తిరుమంజనం జరగనుంది.

గురుకుల విద్యార్థులకు న్యాయం చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జేఏసీ నేతలు



చిన్నారులను పరామర్శిస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు(విద్య), జూలై 16: నిరుపేద కుటుంబాలకు చెందిన గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం, అధికారులు అండగా ఉండి న్యాయం చేయాలని ఏపీ విద్యార్థి జేఏ సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆది త్యసాయి అన్నారు. నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాయుడుపేట గురుకులం విద్యార్థులను మంగళవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. ప్రభుత్వం పేదల పిల్లలకు గురుకులంలో అన్ని వసతులు కల్పిస్తున్నా కొంతమంది అవినీతికి పాల్పడి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు, హెల్త్ ఆఫీసర్లలో ఆహారాన్ని తనిఖీలు చేయించాలన్నారు. పిల్లలకు అండగా ఉండి ముస్ముందు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో నేతలు బాలు, దినేష్, అబు తదితరులు పాల్గొన్నారు.

● **బీజేపీ నేతల పరామర్శ**

నెల్లూరు(వైద్యం) : నెల్లూరు నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డయేరియాతో చికిత్స పొందుతున్న నాయుడుపేట గురుకులం విద్యార్థులను బీజేపీ నాయకులు పరామర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి జీజీహెచ్‌కు చేరుకుని బాధిత వి ద్యార్థులకు అందుతున్న వైద్య చికి త్సలను వైద్యులను అడిగి తెలు సుకున్నారు. నాయుడుపేట గురుకుల వసతి గృహంపై తిరుపతి కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, విజయశ్రీ, మౌనిక, సుజాతా తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్ఠు వ్యాధిపై ప్రత్యేక సర్వే

● జిల్లా కుష్ఠువ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి



మాట్లాడుతున్న డాక్టర్ ఇమ్రాన్

నెల్లూరు(వైద్యం), జూలై 16 : జిల్లాలో ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై ప్రత్యేక సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్థులను గుర్తించనున్నట్లు జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కోటమిట్ట, మల్లికార్జునపురం, రాజాగారివీధి, చాకలివీధి ప్రాంతాల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో గుర్తించే వ్యాధిగ్రస్థులకు వైద్య చికిత్స అందజేయాలని తెలిపారు. ప్రాథమిక దశలోనే వ్యాధిగ్రస్థులను గుర్తిస్తే సత్వర చికిత్స ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చన్నారు. వీలైనన్ని అనుమానిత కేసులను గుర్తించి వైద్యాధికారి వద్దకు తీసుకు వచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి చికిత్స అందించాలన్నారు. కుష్ఠు వ్యాధి రహిత సమాజయే ధ్యేయంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌కృష్ణ, డాక్టర్ గీతాంజలి, సుబ్బయ్య, రమణారెడ్డి, తిరుపతయ్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **వైఎస్సార్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో...**

నగరంలోని వైఎస్సార్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా కుష్ఠువ్యాధి నివారణ సంస్థ, పీహెచ్‌పీ సంయుక్త ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఇమ్రాన్ మాట్లాడుతూ సర్వే కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించి వారికి అంగవైకల్యం రాకుండా ఎన్‌ఎంలు, ఆశాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ సుబ్బయ్య, పీహెచ్‌డబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ఆసుపత్రి కో ఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఓవెల్'లో నావెల్ యూనిట్ ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అధికారులు

నెల్లూరు(విద్య), జూలై 16: నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లోని ఓవెల్ పాఠశాలలో ఎన్‌సీసీ, నావెల్ యూనిట్ విభాగాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ గణేష్ మాట్లాడుతూ ఎన్‌సీసీలో ఆర్మీ, నేవీ ఎయిర్‌వింగ్‌లతో కూడిన శిక్షణ అందజేస్తామన్నారు. విద్యాసంస్థల్లోని విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు దేశభక్తి కలిగిన పౌరులుగా తీర్చిదిద్దుతామన్నారు. విలువైన జీవన నైపుణ్యాలను అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. పాఠశాల డైరెక్టర్ వేణు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని విభాగాల్లో దృఢంగా, ఆత్మస్థైర్యంతో రాణించాలంటే ఎన్‌సీసీ ఒక్కటే మార్గమని, ప్రతి ఒక్కరూ దీనిలో చేరి నిష్ణాతులుగా ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కార్యాలయ సూపరింటెండెంట్ జి.సాగర్ ముకుంద, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ అరుణకుమార్‌శర్మ, సిబ్బంది రాథోడ్ వెంకటేష్, పాఠశాల ప్రిన్సిపాల్ యూ.రమణయ్యనాయుడు, సీఈవో ప్రమీల, జీఎం మహదేవ్, ఈడీ బాలు, డీజీఎం శ్రీనివాసులు, ఏజీఎం గంగాధర్, ఐసీవో ఏజీఎం కిషోర్, ఏజీఎం హర్షవర్ధన్, సిబ్బంది ఎస్‌కే.రఫి పాల్గొన్నారు.

నెల్లూరు కార్పొరేషన్ సూపరింటెండెంట్‌గా నాగేశ్వరరావు

నెల్లూరు(సిటీ), జూలై 16 : చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న బీ నాగేశ్వరరావును తిరిగి నెల్లూరు కార్పొరేషన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ నుంచి కుప్పం కమిషనర్‌గా వెళ్లిన ఆయనను తిరిగి సొంత గూటికి బదిలీ చేశారు. కాగా నెల్లూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా ఉన్న వీ.శ్రీనివాసరావు డిప్యుటేషన్‌పై ప్రకాశం జిల్లా గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తుండగా ఆయనను కుప్పం కమిషనర్‌గా బదిలీ చేశారు.

అనాథ శరణాలయానికి నిత్యావసరాల పంపిణీ

నెల్లూరు(విద్య), జూలై 16: నగరంలోని ఆర్టీసీ కాలనీలో ఉన్న అనాథ శరణాలయానికి భారతీయ సంస్కృతి సంఘం సహకారంతో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందచేశారు. అనంతరం అనాథ బాలలకు అన్నవితరణ చేసి విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సేవాసమితి జిల్లా అధ్యక్షుడు వై.దయా మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో స్థిరపడిన ప్రవీణ్ రెడ్డి భారతీయ సంస్కృతి సంస్థను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అందులో భాగంగా సంస్థ తొలి కార్యక్రమాన్ని తమ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించామన్నారు. సంస్కృతి సంస్థ సభ్యులు మురళీకృష్ణ, కళ్యాణ్, పల్లం రవి, విష్ణులు సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యుడు నాదెండ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

జనసేన కోర్ కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 16: జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కోర్ కమిటీ సభ్యులు, డివిజన్ నాయకుల పరిచయ కార్యక్రమం నగరంలోని గోమతి నగర్‌లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యాలయం ఇన్‌చార్జ్ జమీర్, కోర్ కమిటీ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రవి, నాగరత్నం యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్యామ్, చదవలవాడ రాజేష్, శ్రీరామ్, శ్రీమతి రాము, నగర డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచి

● వైసీపీ నాయకుల వేధింపులు తాళలేక చేరినట్లు వెల్లడి



సర్పంచుకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు, జూలై 16: వైసీపీ నాయకుల వేధింపులు తాళలేక పార్టీని వీడి తెలుగుదేశంలో చేరినట్లు కోడూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ యాటగిరి కృష్ణవేణి తెలిపారు. వేదాయపాలెం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలుగుదేశం కండువా వేసి స్వాగతం పలికారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడారు. గ్రామంలో ఏమి అభివృద్ధి చేయకుండా బిల్లులపై సంతకాల కోసం వైసీపీ నాయకులు పెట్టిన వేధింపులు తట్టుకోలేక ఊరువదిలి సర్పంచ్ వరిగొండలో తలదాచుకుంటున్నట్లు తెలిపారు. కోడూరు పంచాయతీ అభివృ ద్ధికి సంపూర్ణ సహకారాలు అందిస్తామని సోమిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీర బోయిన గంగాధర్, బైనబోయిన శ్రీనివాసులు, ఆవుల మునిరత్నం, ఊటుకూరు శ్రీనివాసులు, షేక్.అబూబకర్, చెరుకూరు పరంధామయ్య, పామంజి దొర బాబు, ఊటుకూరు అవినాష్, సద్దాంహుస్సేన్ పాల్గన్నారు.

దర్గాలో సోమిరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు

మనుబోలు, జూలై 16: కాగితాలపూరు గ్రామంలోని దర్గాలో మంగళవారం రాత్రి టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మొహర్రం పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం షియా ముస్లింలు ఆయన్ను శాలువాతో సత్కరించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లింలంతా ఐకమత్యంగా ఉండాలన్నారు. దర్గాలకు అవసరమైన అన్నివసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామకృష్ణయ్య, మదునాయుడు, వెంకటరమణా రెడ్డి, చిట్టిబాబు, కిర ణ్, దశయ్య, అశోక్, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఇందుకూరుపేట, జూలై 16: మండలంలోని రాపూరులో వెలిసి ఉన్న పోలేరమ్మకు మంగళవారం గ్రామస్థులు పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి మేకపోతును టీడీపీ నాయకులు ముంగర గోపాల్‌యాదవ్-సుమలత దంపతులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ముంగర శ్రీనివాసులు, పాశం చలమయ్య, పొన్నెబోయిన చెంచురామయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● **పొదలకూరు :** అల్లూర్తిలో గ్రామశక్తి పోలేరమ్మకు మంగళవారం గ్రామ పొంగళ్లు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి తప్పెట్లు తాళాలతో గంపల్లో పొంగళ్ల సామగ్రి పెట్టుకుని ఆలయంకు చేరుకున్నారు. అనంతరం పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామంలో 15ఏళ్ల కిందట పొంగళ్లు నిర్వహించామని తిరిగి సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గెలవడంతో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నట్లు గ్రామ నాయకులు ప్రదీప్‌యాదవ్, పాపిరెడ్డి, హజరత్‌యాదవ్, దయాకర్‌రెడ్డి, సుబ్బారావు, దశయ్య, శ్రీను తెలిపారు.

కుష్ఠువ్యాధి సర్వేపై శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ పీహెచ్‌సీలో మంగళవారం కుష్ఠువ్యాధి సర్వే, కిలకారీ వ్యాధిపై జొన్నవాడ, రేబాల, అర్బన్ పీహెచ్‌సీల సిబ్బందికి వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు, స్టేట్ కిలకారీ శిక్షణాధికారి కీర్తి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: జగదేవిపేట పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందికి, ఆశా వలంటీర్లకు కుష్ఠు వ్యాధిపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్య క్రమం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ కిషోర్ కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం డీపీఎంవో వెంకటేశ్వర్లు వారితో ప్రతిజ్ఞ చేయించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెచ్‌ఈవో శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ ట్రైనీ అరుణ పాల్గొన్నారు.

కౌలు రైతుల సంక్షేమానికి కృషి

విడవలూరు : కౌలురైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని వ్యవసాయశాఖాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. మండలంలోని వావిళ్ల, గాదెలదిన్నె గ్రామాల్లో కౌలు రైతులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్‌వో కుమార్, వీఏఏ చరణ్, తదితరులు పాల్గొన్నారు.



రంగంలోకి సీఐడీ !



తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో డీటీని విచారిస్తున్న సీఐడీ అధికారులు

తిరుపతి ఆర్డీవో, తుడా కార్యాలయాల్లో విచారణ

ఓటర్ల నమోదులో అక్రమాలపై ఎమ్మెల్యే నానీ ఫిర్యాదు పర్యవసానం

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో, తుడా కార్యాలయాల్లో సీఐడీ అధికారులు మంగళవారం విచారణ జరపడం కలకలం రేపింది.చంద్రగిరి నియోజకవర్గంలో చేపట్టిన ఓటర్ల నమోదులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే పులివర్తి నానీ చేసిన ఫిర్యాదుపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన సీఐడీ అధికారుల బృందం విచారణ చేపట్టింది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్ల నమోదులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని టీడీపీ నేతలు, కార్యకర్తల నుంచీ అసంఖ్యాకంగా ఫిర్యాదులందాయి. కలెక్టర్ మొదలుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ దాకా ఫిర్యాదులు వెళ్ళాయి. తిరుపతి ఆర్డీవో నుంచీ కిందిస్థాయిలో బీఎల్వోల దాకా అధికారులు, సిబ్బంది అప్పటి అధికార పార్టీ వైసీపీకి అనుకూలంగా పనిచేశారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దొంగ ఓట్లు భారీగా చేర్పించారని, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించారని ఆధారాలు కూడా జత చేశారు. అయితే ప్రభుత్వం వీటిపై స్పందించలేదు. ఎన్నికల సంఘం వివరణ కోరినా అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపుచ్చారనే ఆరోపణలున్నాయి. ఎన్నికలు ముగిశాక ఎమ్మెల్యేగా గెలుపొందిన పులివర్తి నానీ మళ్ళీ దీనిపై ప్రభుత్వానికి, సీఐడీ విభాగానికీ ఫిర్యాదు చేశారు. ప్రత్యేకించి గూడూరు ఆర్డీవో మీసాల కిరణ్ కుమార్ ప్రమేయంపై ఆరోపణలు చేశారు.గత వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి రూరల్ తహసిల్దారుగా పనిచేసిన ఆయన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డితో అంటకాగారనే ఆరోపణలున్నాయి. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి వచ్చాక ప్రభుత్వ విప్ హోదాలో చెవిరెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు.తర్వాత గూడూరు ఆర్డీవోగా నియమితులయ్యారు. గూడూరు ఆర్డీవోగా పనిచేస్తూనే వారంలో ఐదు రోజుల పాటు తిరుపతిలోని ఎయిర్ బైపాస్ రోడ్డులో వున్న చెవిరెడ్డి వ్యక్తిగత కార్యాలయంలో మకాం వేసేవారని, చంద్రగిరి పరిధిలోని ఆరు మండలాల తహసిల్దార్లను, తిరుపతి ఆర్డీవోను అక్కడికి పిలిపించుకుని బోగస్ ఓటర్లను చేర్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్డీవో, తహసిల్దార్ల లాగిన్ల పాస్‌వర్డులు తీసుకుని బోగస్ ఓటర్లను చేర్పించడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడం చేశారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్డీవో కార్యాలయంలో రికార్డుల స్వాధీనం

ఎమ్మెల్యే నానీ ఫిర్యాదు నేపథ్యంలో తిరుపతి సీఐడీ డీఎస్పీ పద్మలత, సీఐ రామ్‌కిషోర్, ఎస్ఐ మంజుల, సిబ్బంది మంగళవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. అయితే ఆ సమయానికి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కార్యాలయంలో లేరు. కార్యాలయ ఏవో, ఎన్నికల డీటీలను విచారించిన సీఐడీ అధికారులు ఎన్నికలకు సంబంధించిన కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్డీవో కలెక్టరేట్‌కు వెళ్ళారని, సాయంత్రం వస్తారని సిబ్బంది చెప్పడంతో సీఐడీ అధికారులు మళ్ళీ సాయంత్రం కార్యాలయానికి వెళ్ళారు. అయితే అప్పుడు కూడా ఆర్డీవో లేరు. క్యాంపు వెళ్ళారని, బుధవారం సెలవు కనుక గురువారం అందుబాటులో వుంటారని సిబ్బంది చెప్పారు. దీంతో గత ఐదేళ్ళలో తిరుపతి ఆర్డీవోలుగా పనిచేసిన అధికారులు, డివిజన్ పరిధిలో పనిచేసిన తహసిల్దార్లు, ఎన్నికల డీటీలు, బీఎల్వోలు, ఆర్డీవో, తహసిల్దారు కార్యాలయాల్లో పనిచేసిన ఎన్నికల సిబ్బంది ఎవరనే వివరాలు అందజేయాలని సీఐడీ అధికారులు కార్యాలయ ఏవోకు లేఖ అందజేశారు. చెవిరెడ్డి ఓఎస్డీగా కిరణ్‌కుమార్ తుడా వ్యవహారాల్లో ఏమైనా జోక్యం చేసుకున్నారా? నిధుల దుర్వినియోగంలో ఆయన ప్రమేయం ఏమైనా వుందా? అన్న కోణంలో విచారించేందుకు తుడా కార్యాలయానికి వెళ్ళారు. అక్కడ తుడా వీసీ వెంకట నారాయణను విచారించారు. అయితే చెవిరెడ్డికి ప్రభుత్వ విప్ హోదాలో కిరణ్‌కుమార్ ఓఎస్డీగా పనిచేశారు తప్ప తుడాతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని, తుడా వ్యవహారాల్లో ఆయన ప్రమేయం ఏమీ లేదని వీసీ సమాధానమిచ్చినట్టు తెలిసింది.



తుడా కార్యాలయంలో వీసీతో చర్చిస్తున్న సీఐడీ బృందం

రేపు తిరుపతి ఆర్డీవోను విచారించే అవకాశం?

తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి మంగళవారం అందుబాటులో లేకపోవడంతో గురువారం ఆయనను సీఐడీ అధికారులు విచారించే అవకాశం వుంది. అయితే గురువారం అయినా ఆయన అందుబాటులోకి వస్తారా లేదా? అందుబాటులోకి రాకుంటే సీఐడీ అధికారులు ఏం చేస్తారన్నది వేచి చూడాల్సి వుంది. కాగా చంద్రగిరి నియోజకవర్గంలో బోగస్ ఓటర్లను పెద్ద సంఖ్యలో చేర్పించారనే ఫిర్యాదుల నేపథ్యంలో సీఐడీ అధికారుల విచారణ మొదలు కావడంతో ఎన్నికల విధుల్లో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు హడలిపోతున్నారు. తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందో, తమపై ఏం చర్యలు వుంటాయోనని ఆందోళనకు లోనవుతున్నారు.

జర్నలిస్టు హెల్త్ స్కీం పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 16: రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని ఈ ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, కుటుంబసభ్యులకు రూ.2లక్షల విలువైన వైద్య సేవలు అందుతాయన్నారు. ఏడాదిలో ఎన్నిసార్లయినా పరిమితులు లేకుండా సదుపాయం వర్తిస్తుందన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. ఆదాయ పరిమితి లేకుండా నిర్ధేశిత చికిత్సలకు ఉచిత ఓపీ సేవలు పొందవచ్చన్నారు. పథకానికి డాక్టర్ నందమూరి తారకరామావు వైద్యసేవ ట్రస్టు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా ,సమాచార పౌరసరఫరాల శాఖ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.



టీటీడీ జేఈవోగా వెంకయ్య చౌదరి

తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ సంయుక్త కార్యనిర్వహణాధికారిగా సీహెచ్ వెంకయ్య చౌదరి నియమితులయ్యారు.2005వ సంవత్సరం బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారైన వెంకయ్య చౌదరిని డిప్యుటేషన్‌పై పంపాలన్న రాష్ట్రప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో ఆయన మూడేళ్ల పాటు ఏపీలో పనిచేయనున్నారు. గతంలో ఏపీ మినరల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్, ఎండీగా వెంకయ్య చౌదరి పనిచేశారు. సాధారణంగా టీటీడీకి ఈవోతో పాటు తిరుమలకు ఒకరు, తిరుపతికి ఒకరు చొప్పున ఇద్దరు జేఈవోలుంటారు. కానీ, గత వైసీపీ ప్రభుత్వం ఇద్దరు జేఈవోలను తిరుపతికే పరిమితం చేసి తిరుమలలో కేవలం ఈవోగా ధర్మారెడ్డిని మాత్రమే కొనసాగించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పూర్వపు పద్ధతిలోనే ఈవోతో పాటు తిరుమలకు జేఈవోను యధావిధిగా కొనసాగిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.సమర్థవంతమైన అధికారిగా పేరున్న వెంకయ్య చౌదరి ఎంట్రీతో టీటీడీలో ఎలాంటి మార్పులు, ఉంటాయో చూడాల్సివుంది.

23 కిలోల గంజాయి స్వాధీనం

- తమిళనాడుకు తరలిస్తున్న ముగ్గురు నిందితుల అరెస్టు



సీజ్ చేసిన గంజాయి మూటలను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం),జూలై 16 : అనకాపల్లి నుంచి గూడూరు మీదుగా చెన్నైకి తరలిస్తున్న 23.5 కిలోల గంజాయి ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.తిరుపతిలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. చెన్నైకి చెందిన సెల్వం గోకుల్, శరవణన్ అభిషేక్, రాజ్ తమిళసెల్వం, శివ కొంతకాలంగా అనకాపల్లి నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తున్నారు.గూడూరులోని రైల్వే పార్శిల్ కార్యాలయం వద్ద మంగళవారం డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి, వన్‌టౌన్ సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరి తదితరులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారి వద్ద దాదాపు రూ 1.70 లక్షల విలువ చేసే 23.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. గంజాయి విక్రయించినా, తరలించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు కూడా గంజాయి నివారణకు సహకరించాలని ఎవరైనా విక్రయిస్తుంటే వెంటనే పోలీసు వాట్సాప్ నెంబరు 8099999977కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

నిలకడగా గురుకుల విద్యార్థుల ఆరోగ్యం



నాయుడుపేట సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

నాయుడుపేట టౌన్, జూలై 16: కలుషిత ఆహారంతో ఆస్పత్రిపాలైన నాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉంది. 128 మంది విద్యార్థులు ఆదివారం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందగా సోమవారానికి సగానికి పైగా డిశ్చార్జి అయ్యారు. నాయుడుపేట ఆస్పత్రిలో 20 మంది, నెల్లూరులో 13మంది, గూడూరులో 30మంది చికిత్స పొందుతున్నారు.

జేసీ విచారణ ప్రారంభం

గురుకుల పాఠశాలలో కలుసిత ఆహారం ఘటనపై జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ మంగళవారం విచారణ చేపట్టారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్న ఆయన అక్కడి అధికారుల నుంచి వివరాలను సేకరించారు.అక్కడినుంచి నేరుగా గురుకుల పాఠశాలకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. గురుకుల విద్యాలయ అధికారులు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. దీనిపై సమగ్ర నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందిస్తామని ఆయన తెలిపారు. అపరిశుభ్ర వాతావరణంతో పాటు సరైన భోజన వసతులు లేని ఇటువంటి హాస్టల్‌లో తమ పిల్లలను ఎలా చదివించాలని పలువురు తల్లిదండ్రులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు కూడా జేసీని కలిసి ఇక్కడి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీసీవో పద్మజ, ఆర్డీవోలు కిరణ్‌కుమార్,చంద్రముని,తహసీల్దారు కల్యాణి, మున్సిపల్ కమిషనర్ జనార్ధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వందమందికి పైగా విద్యార్థులు ఒక్కసారిగా ఆస్పత్రి పాలవడంతో గురుకుల విద్యాలయ అధికారుల్లో చలనం వచ్చింది.డివిజన్‌స్థాయి అధికారులంతా గురుకుల విద్యాలయానికి చేరుకుని పరిస్థితులను చక్కదిద్దే పనిలో పడ్డారు.మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఆదివారం, సోమవారం పరిసరాలను శుభ్రపరిచారు.



స్టేట్ ఫస్ట్, సెకండ్ ర్యాంకర్లు చిత్ర శుక్లా,కావేరీ శుక్లా

ఏపీఆర్‌సెట్‌లో పద్మావతి వర్సిటీ ప్రతిభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16: ఏపీఆర్‌సెట్ లా సబ్జెక్టులో పద్మావతి యూనివర్సిటీ లా విద్యార్థినులు చిత్ర శుక్లా, కావేరీ శుక్లా స్టేట్ ప్రతిభ కనబరిచారు. చిత్ర శుక్లా 136 మార్కులతో 1 వ ర్యాంకు, కావేరి శుక్లా 136 మార్కులతో 2 వ ర్యాంకు సాధించారు. వీరిద్దరూ ప్రస్తుతం ఎల్ఎల్ఎం 4వ సెమిస్టర్ చదువుతున్నారు. వీరిని యూనివర్సిటీ ఉన్నతాధికారులు, లా విభాగ అధ్యాపకులు అభినందించారు.

రెండు హోటళ్ల సీజ్

నాయుడుపేట, జూలై 16:నాయుడుపేట పట్టణంలోని హోటళ్లు, దాబాల్లో మంగళవారం ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి జి.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ జనార్ధన రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నర్మద తదితరులు పట్టణంలోని పలు హోటళ్లు, డాబాలలో ఆహార పదార్థాలను, పరిసరాల పరిశుభ్రతను, వంటకు వినియోగించే వస్తువుల నాణ్యతను పరిశీలించారు. హోటల్ అమరావతిలో వంట గది పరిశుభ్రంగా లేదని, తిరుమల హోటల్‌లో వంట గది పరిశుభ్రంగా లేకపోవడంతో పాటు కాలం చెల్లిన ఆహార పదార్థాలు వాడుతున్నారని సీజ్ చేసినట్లు కమిషనర్ జనార్ధన రెడ్డి తెలిపారు. మిగిలిన హోటళ్లను, డాబాలను పరిశీలించి ఫుడ్ సేఫ్టీ నియమాల మేరకు వంటకు నాణ్యమైన సరుకులనే వాడాలని, వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్చరించారు.



హోటల్‌లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

పుష్పపల్లకిలో మురిపించిన మలయప్ప

శ్రీరంగం సారె సమర్పణలో కొంత గందరగోళం







తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆణివార ఆస్థానం సందర్భంగా మంగళవారం సాయంత్రం తిరుమలలో పుష్పపల్లకి సేవ కన్నులపండువగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన పల్లకిపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.ఆరురకాల సంప్రదాయ పుష్పాలు, ఆరు రకాల స్వదేశీ, విదేశీ కట్‌ఫ్లవర్స్‌తో కలిసి మొత్తం టన్ను బరువు కలిగిన పుష్పాలను స్వామివారి పల్లకి అలంకరణకు వినియోగించారు. కృత, త్రేతా, ద్వాపర యుగాలకు చెందిన వివిధ దేవతామూర్తుల ప్రతిమలను పల్లకీకి ఏర్పాటు చేశారు. కాగా తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగం రంగనాథస్వామి ఆలయం నుంచి శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా బేడి ఆంజనేయస్వామి ఆలయం పక్కనే ఉన్న పెద్దజీయర్ మఠంలో శ్రీవారిసారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి తమిళనాడు దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు, పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీఈ జేఈవో వీరబ్రహ్మం కలిసి పట్టువస్త్రాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్లి శ్రీవారికి సమర్పించారు. కాగా సారెను ఆలయంలోకి తీసుకెళ్లే సమయంలో మహద్వారం వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. తొలుత సారెతో పాటు పదిమందికి అనుమతి ఇచ్చారు. ఈక్రమంలో శ్రీవారి ఆలయ జీయర్‌స్వామి, మంత్రి శేఖర్‌బాబుతో పాటు పదిమంది మహద్వారం గేటులోకి ప్రవేశించగానే భద్రతాసిబ్బంది గేటు మూసివేశారు. దీంతో దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి కుమార గురుబాలన్ దంపతులు ఆలయం వెలుపలే ఉండిపోవాల్సి వచ్చింది.మంత్రి శేఖర్‌బాబు గుర్తించి తిరిగి గేటు వద్దకు చేరుకుని ఆలయంలోకి అనుమతించాలని విన్నవించారు. అనంతరం కుమార గురుబాలన్‌ను మహద్వారం నుంచి అనుమతించి ఆయన సతీమణిని బయోమెట్రిక్ నుంచి అనుమతించారు. శ్రీరంగ నుంచి వచ్చిన వారిలో ఇద్దరు ముందుగా మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లడంతో సమస్య తలెత్తినట్టు అధికారులు గుర్తించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

విద్యార్థులకు పనికొచ్చే వస్తువులు తెండి
ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, జూలై 16: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... బుధవారం తన జన్మదినం సందర్భంగా వేడుకలకు వచ్చే నాయకులు శాలువలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలకు బదులుగా విద్యార్థులకు అవసరమైన సామగ్రిని బహుమానంగా ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు 8 నెలలుగా జీతాలు ఆపేసిందని వారందరికీ ఈ నెలాఖరుకల్లా పెండింగ్ జీతాతో పాటు ఇకపై ప్రతి నెలా సక్రమంగా జీతాలు అందేలా చూస్తామని రామకృష్ణ హామీ ఇచ్చారు.


కురుగొండ్లను సత్కరిస్తున్న గంగోటి నాగేశ్వరరావు

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలను కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ వివరాలను అడిగి తెలుసుకొన్నారు. బాలాయపల్లి పంచాయతీకి ప్రభుత్వం 10 సెంట్ల స్థలాన్ని మార్కెట్ ధరకు కేటాయిస్తే కాంప్లెక్స్ నిర్మించుకుని పంచాయతీ ఆదాయం పెంచుకుంటామన్న గ్రామస్తుల విన్నపాన్ని కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

పట్టపగలు కాకినాడవాసిపై హత్యాయత్నం

● ఇనుపరాడ్‌తో దాడి చేసిన గుర్తుతెలియని వ్యక్తి

తడ, జూలై 16: పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే ఓ గుర్తుతెలియని వ్యక్తి ఇనుపరాడ్‌తో మరో వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన సతీష్‌కుమార్ స్థానిక శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో పని చేస్తుంటాడు. రోజులాగానే మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో పరిశ్రమకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో ఓబాలమ్మ ఆలయం వద్ద గుర్తుతెలియన వ్యక్తి ఇనుపరాడ్‌తో వెనుక నుంచి దాడి చేశాడు. అందరూ చూస్తుండగానే తీవ్రంగా గాయపరచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సతీష్‌కుమార్‌ను శ్రీసిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం చెన్నైకు తీసుకెళ్లారు. సతీష్‌కుమార్‌కు కాకినాడ పట్టణానికి చెందిన నీలాపు మౌనిక అనే వివాహితతో పరిచయం ఏర్పడింది. దీంతో ఆమె తన భర్త, ఇద్దరు పిల్లలను వదిలివేసి నాలుగు నెలల క్రితం సతీష్‌కుమార్‌తో కలిసి తడకు వచ్చేసింది. ఇక్కడ ఓ అద్దె ఇంట్లో ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. కొద్దిరోజులుగా తన భర్త తమ ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు, పలుమార్లు ఫోన్లో బెదిరించినట్లు, ఇందులో భాగంగా అతనే ఈ హత్యాయత్నానికి పాల్పడి ఉంటాడని మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.


గాయపడ్డ సతీష్‌కుమార్

ఘనంగా టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు



సూళ్లూరుపేట, జూలై 16: సూళ్లూరుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఏ.రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజీ పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం మన్నారుపోలూరు వీఎంఆర్ కాలనీలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ వి.సుబ్రమణ్యం, డి.రవి, రాజసులోచనమ్మ, ఆలీభాయ్, ఎం.సాయి నారాయణ, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.









గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నిన్న అలా....నేడు ఇలా!

● గురుకులంలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చర్యలు



ఆదివారం మలమూత్ర విసర్జనలతో... సోమవారం శుభ్రంగా...

నాయుడుపేట, జూలై 16: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాం. అలా లేకుంటే రోగాల బారిన పడుతాం. అదే చిన్నపిల్లలైతే ఆ రోగాలు వెంటనే అంటుకుంటాయి. ఇది అందరికీ తెలిసిన విషయమే. కానీ ఆ విషయం మాత్రం గురుకుల పాఠశాల నిర్వాహకులకు తెలియ లేదో లేక మన ఇల్లు కాదనుకుని బాధ్యతరాహిత్యంగా వ్యవహరించి 128 మంది విద్యార్థులను అతిసార బారిన పడేలా చేశారు నాయుడుపేట గురుకుల విద్యాలయ నిర్వాహకులు. అంతమంది ఒక్కసారిగా అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలవడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. అప్పటికి గానీ సదరు గురుకుల విద్యాలయ అధికారుల్లో తాము చేసిన తప్పేందో తెలిసిరాలేదు. ఈ ఘటనతో డివిజన్ స్థాయి అధికారులంతా గురుకుల విద్యాలయానికి చేరుకుని పరిస్థితులను చక్కదిద్దే పనిలో పడ్డారు. స్థానిక మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు నిర్విరామంగా శ్రమించి పరిసరాలను శుభ్రపరిచారు. పరిసరాలు ఇలాగే శుభ్రంగా కొనసాగేలా అధికారుల చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

కారూరు చెరువులో ఆక్రమణల తొలగింపు

తడ, జూలై 16: మండలంలోని కారూరు పెద్దచెరువు ఆక్రమణకు గురవడంతో అధికారులు తొలగించారు. చెరువును కొందరు ఆక్రమించారంటూ అధికారులకు గతంలో ఫిర్యాదులు అందాయి. వారు స్పందించకపోవడంతో గ్రామస్థులు లోకాయుక్తను ఆశ్రయించారు. ఆ ఫిర్యాదును పరిశీలించిన న్యాయమూర్తి ఆక్రమణలను తొలగించాలంటూ వారం రోజుల క్రితం జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సదరు అధికారులు పంచాయతీరాజ్ అధికారులతో కలిసి రెవెన్యూ, పోలీసుల సహకారంతో మంగళవారం ఆక్రమణలను తొలగించారు. ఆ మేరకు హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్నామని మరోసారి ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జలవనరుల శాఖ ఏఈ రమేష్ తెలిపారు.

తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర

పెళ్లకూరు, జూలై 16: మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో 50 మంది పార్టీ నాయకులు మంగళవారం తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. కొత్తూరు పార్టీ కార్యలయం వద్ద పాదయాత్రను సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కొత్తూరు టీడీపీ కార్యాలయం నుంచి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వి.శేఖర్‌రెడ్డి, తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు ఎస్.చెంగమ్మ, నాయకులు కృష్ణమనాయుడు, సిద్దులయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు మాతృవియోగం

నాయుడుపేట/పెళ్లకూరు, జూలై 16: పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గాలి రమేష్ నాయుడు తల్లి రాధమ్మ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మీనాయుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎం.శోభారాణి తదితరులు నాయుడు పేటలోని రమేష్‌నాయుడు నివాసానికి చేరుకుని రాధమ్మ భౌతిక కాయానికి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు వి.మురళీకృష్ణారెడ్డి, పేరం రమేష్ నాయుడు, డి.నాగేంద్రప్రసాద్ రెడ్డి, తమ ప్రగాఢ సానుభూతిని రమేష్ నాయుడి కుటుంబీకులకు తెలిపారు.

వాకాడు గురుకులంలో తనిఖీ

వాకాడు, జూలై 16: మండలంలోని అంబేడ్కర్ గురుకులం బాలుర పాఠశాలలో సోమవారం డీటీ సందీప్ విద్యా శాఖ అధికారులతో కలిసి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈనెల 15న నాయుడుపేట గురుకులంలో విద్యార్థులు కలుషిత ఆహారం తీసుకుని అతిసార బారిన పడడంతో తనిఖీలు నిర్వహించామని డీటీ తెలిపారు. ప్రిన్సిపాల్, వంట నిర్వాహకులతో, కాంట్రాక్టరుతో సమావేశమయ్యారు. రికార్డులను పరిశీలించారు.

అక్రమాలపై విచారణ నిర్వహించాలి

గూడూరు అర్బన్, జూలై 16: తిరుమల తిరుపతి దేవస్థానంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్ర మాలపై విచారణ జరిపించాలని ఢిల్లీలో సీబీఐ అధికారులకు విన్న వించినట్లు కలియుగ వెంకటేశ్వర స్వామి ధార్మిక మండలి అధ్యక్షుడు పెంచలనాయుడు పేర్కొన్నారు.

బోర్డును సరిచేయండి

నాయుడుపేట టౌన్, జూలై 16: నాయుడుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ ధ్యాన్ చంద్ పరిశీలించారు. మంగళవారం గురుకుల పాఠశాల తనిఖీ కోసం వచ్చిన జేసీ ముందుగా ఆర్డీవో చంద్రమునితో సమావేశమయ్యారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. అదే సమయంలో వీఆర్వో గది బయట ఉన్న ఫ్లెక్సీ చిరిగిపోయి ఉండడంతో సరి చేయాలంటూ తహసీల్దార్ సుమలతను ఆదేశించారు.

రేపటినుంచి జనసేన సభ్యత్వం

గూడూరు అర్బన్ : జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదును ఈనెల 18నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ చెప్పారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

చిల్లకూరు, జూలై 16: మండలంలోని బల్లవోలులో విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.... గ్రామానికి చెందిన పెంచలయ్య(54) కరెంట్ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే గ్రామంలో కరెంట్ పనులు చేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.





